

గ్రామ పంచాయతీ కార్యాలయంలో తీర్మాన పత్రాన్ని చూపిస్తున్న పాలకవర్గ సభ్యులు

## మీర్జాపూర్‌లో మద్యపాన నిషేధం

**పూడూరు, జూన్ 18, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని మీర్జాపూర్ గ్రామంలో మద్యపాన నిషేదాన్ని విధిస్తున్నట్లు సర్పంచ్ కొనింటి సుజాతమల్లేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ప్రజలకోరిక మేరకు ఈనెల 16వతేదీన గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశమైన వార్డు సభ్యులు గ్రామంలోని కిరాణ (బెల్ట్)షాపుల్లో ఎలాంటి బీరు, లిక్కర్లు అమ్మకూడదని నిషేదించినట్లు, కల్లు దుకాణాలను గుడి, బడికిదూరంగా నిర్వహించాలని తీర్మానించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెంద్రయ్య, వార్డు సభ్యులు కావలి జంగయ్య, కుర్వ అపర్ణ, ఎండి ఉస్మాన్, వి బందయ్య, వి వెంకటమ్మ, దప్పు అనిత, మంగ అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.



## గ్యాస్ సరఫరాలో ఆగని అక్రమాలు

### వినియోగదారులకు తెలియకుండా పక్కదారి

### ఆర్డీవోకు ఫిర్యాదుల పరంపర

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కొరత లేకున్నా వంట గ్యాస్ సరఫరా విధానం లోపభూయిష్టంగా మారింది. గోదాముల్లో పుష్కలంగా నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం చెబుతున్నా ఏజెన్సీల నుంచి అనునిత్యం సమస్య ఉత్పన్నమవుతూనే ఉన్నది. గ్యాస్ బుక్ చేసిన తర్వాత రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొన్నది. చివరకు వినియోగదారులకు డీఏసీ నెంబర్ వచ్చిన కొద్ది రోజులకే సెల్‌ఫోన్‌లకు 'డోర్ క్లోస్డ్' మెసెజ్ వస్తోంది. ఇదంతా ఏజెన్సీల మాయాజాలం అని తేట తెల్లమవుతోంది. దీనిపై అధికారులకు ఫిర్యాదులు వస్తున్నా ఏజెన్సీ నిర్వాహకుల పద్ధతి మారడం లేదు. వినియోగదారులకు కృత్రిమ కొరత సృష్టించిన ఏజెన్సీలు హోటళ్లకు మాత్రం డొమెస్టిక్ గ్యాస్ సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో పోల్చుకుంటే ఇప్పుడు హోటళ్లు దర్జాగా నడుస్తున్నాయి. గ్యాస్ కొరత బూచీ చూపించి తినుబం డారాలపై ధరలు అమాంతంగా పెంచేసిన హోటళ్ల యజమానులు ఇప్పుడు ధరలు తగ్గించడం లేదు.

వికారాబాద్ జిల్లాలో నిత్యం కృత్రిమ గ్యాస్ కొరత సృష్టించారు. ప్రస్తుతం వ్యవ సాయ సీజన్ ఆరంభం కావడం వల్ల అధికార యంత్రాంగం బిజీగా ఉంటున్నది. ఇదే అదనుగా భావించిన గ్యాస్ నిర్వాహకులు వినియోగదారులకు ఇబ్బందులు పెడుతున్నారు. తాండూరు పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు చెనిమిళ్ల బస్వరాజ్ తనకు జరిగిన అన్యాయంపై రెవెన్యూ డివిజనల్ అధికారికి లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. దీనిపై వెంటనే విచారణ జరిపించాలని ఆర్డీవో కింది మిగతా 3లో

# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త



# ఎల్ నినోను ఎదుర్కొనేదెలా!



### వ్యవసాయశాఖ యాక్షన్ ప్లాన్

### వర్షాభావంలోనూ లాభాల బాటకు అడుగులు

### తాండూరు కందిపై ఫోకస్

### ప్రభుత్వ విత్తనంపై రైతుల ఆసక్తి

### ఎకరాకు 12 క్వింటాళ్ల దిగుబడి

### బోద కాల్వల పద్ధతి మేలు

### శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించటంతో వానాకాలం సాగుకు వికారాబాద్ జిల్లా వ్యవసాయశాఖ అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. జిల్లా రైతాంగానికి కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లాలోని భూములు ప్రధానంగా పత్తి, కంది, వరి, మొక్కజొన్న, పెసర, మినుము తదితర పంటల సాగుకు ఎంతో అనుకూలం. అయితే, ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా ఉండే అవకాశం ఉందని వాతావారణశాఖ ప్రకటించడం, ప్రస్తుతం ఇంకా ఒక మోస్తరుగా కూడా వర్షాలు కురియకపోవడంతో వ్యవసాయశాఖ ముందస్తు యాక్షన్ ప్లాన్‌కు సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగా పప్పుధాన్యాలు, నూనె గింజలు, ఆయిల్పామ్ వంటి లాభసాటి ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది.

**50 వేల ఎకరాలలో కంది సాగు**

ప్రతియేటా వికారాబాద్ జిల్లాలో సుమారు 50 వేల ఎకరాలలో కంది పంట సాగవుతుంది. ప్రస్తుత వాతారణ పరిస్థితుల నేపథ్యంలో ఈ సాగు విస్తీర్ణం పెంచే దిశగా వ్యవసాయశాఖ అడుగులు వేస్తోంది. నకిలీ విత్తనాలు రాజ్యమేలుతున్న తరుణంలో తాండూరులో వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఉత్పత్తి చేసిన తెలంగాణ కంది -3పై అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే 100 క్వింటాళ్ల విత్తనం సరఫరా చేశారు. మరో 100 క్వింటాళ్ల కంది విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు తెలిపారు.

**యాభై యేళ్లుగా ఎర్ర కంది వంగడం ఉత్పత్తులు**

దశాబ్దాలుగా ఎక్కువ మంది రైతులు ఇదే పంటపై ఆధారపడి జీవిస్తున్నారు. యాభై యేళ్లుగా ఎర్ర కంది (ఆబులం) వంగడం ఉత్పత్తులు గణనీయంగా సాధిస్తున్నారు. ఈ విత్తనాన్ని బషీరాబాద్ మండలం రైతులు తయారీ చేశారు. తాండూరు, కొడంగల్, కర్ణాటకలోని సేడెం, గుర్మిట్‌కాల్ ప్రాంతాలను కలిపి తాండూరు కందిగా పిలుస్తుంటారు.

**తెలంగాణ కంది-3 విత్తనానికి డిమాండ్**

40 యేళ్ల క్రితం తాండూరులో వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని నెలకొల్పారు. ఆచార్య జయశంకర్ (గతంలో ఎన్జీ రంగా) వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కొనసాగుతోంది. ఇద్దరు ప్రధాన శాస్త్రవేత్తలు, పలువురు యువ శాస్త్రవేత్తలు కంది పంటపై నిరంతర అధ్యయనం చేస్తున్నారు. తాండూరు శాస్త్రవేత్తల శ్రమ ఫలితమే తెలంగాణ కంది-3 వంగడం. ఈ విత్తనాన్ని టీడీఆర్‌జీ-59 అని కూడా పిలుస్తున్నారు. దీన్ని ఐదేళ్ల క్రితమే మార్కెట్లోకి విడుదల చేశారు. ప్రస్తుతం ఈ సీడ్‌కు భలే డిమాండ్ లభిస్తోంది. వర్షాభావ పరిస్థితుల్లో కూడా మంచి దిగుబడులు సాధిస్తుందని చెబుతున్నారు.

**నాలుగు కిలోలు రూ.800**

తెలంగాణ కంది-3 వంగడం 4 కిలోల బస్తాకు రూ.800 ధర నిర్ణయించినట్లు చెప్పారు. తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్, కోస్గి, మద్దూరు, దౌల్తాబాద్, సేడెం, కురుకుంటా, గుర్మిట్‌కాల్, చించోలి ప్రాంతాల నుంచి కూడా రైతులు ఈ విత్తనాలు కొనుగోలు చేశారు.



కంది రైతులకు వరప్రసాదంగా ఉన్న తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం



పంపిణీకి సిద్ధంగా ఉన్న కంది విత్తనాలు

కొడంగల్ నియోజకవర్గంలో 30 నుంచి 40 శాతం మంది విత్తనాలు వేసుకున్నారు. మిగిలిన ప్రాంతాల్లో చాలా వరకు విత్తుకోలేదు. మరో రెండు భారీ వర్షాలు కురిస్తేనే కంది విత్తనాలు వేసుకుంటామని రైతులు చెబుతున్నారు.

**మార్కెట్‌కు యేటా మూడు లక్షల క్వింటాళ్ల కందులు**

యేటా తాండూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకే 2 లక్షల నుంచి 3 లక్షల క్వింటాళ్ల కందులు వస్తుంటాయి. బషీరాబాద్, కోటపల్లి, కోడంగల్, కోస్గి మార్కెట్లతో పాటు నారాయణపేట, కర్ణాటకలోని సేడెం, గుల్బర్గా మార్కెట్లకూ కందులు తరలుతుంటాయి. ఈ పరిసరాల ప్రాంతాల్లో కలిపి యేటా కనీసం 5 నుంచి 6 లక్షల క్వింటాళ్ల కందులు దిగుబడి సాధించవచ్చని ఓ అంచనా.

**కంది-3 విత్తనానికే ఎల్ నినో తట్టుకొనే శక్తి ఉంది: ప్రధాన శాస్త్రవేత్త సుధారాణి**

ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వర్షపాతంపై ప్రభావం చూపెడుతున్నా తెలంగాణ కంది-3 (టీడీఆర్‌జీ-59)కి దాన్ని తట్టుకొనే శక్తి ఉందని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి తెలిపారు. ఎండుతెగులు, గొడ్డు తెగులును తట్టుకొనే శక్తి ఈ విత్తనా నికి ఉందన్నారు. మిగిలిన విత్తనాల కంటే చాలా బెటర్ అన్నారు. బోద కాల్వల పద్ధతి ద్వారా విత్తనాలు వేసుకోవాలని సూచించారు. విత్తనాలు వేసుకునే సాళ్ల మధ్యలో 20 మీటర్లకు ఒక బోద కాల్వ తవ్వుకుంటే వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవచ్చని చెప్పారు. చిన్న పాటి చెక్‌డ్యామ్ మాదిరిగా బోద కాల్వలు ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు విత్తనాలు వేసుకునే ముందు అందుబాటులో ఉండే వ్యవసాయశాఖ అధికారులు లేదా శాస్త్రవేత్తల సలహాలు సూచనలు పాటించడం మేలని అన్నారు. ఈ ప్రాంతంలో సాధారణ వర్షపాతం 800 నుంచి 900 మిల్లీమీటర్లు నమోదు అవుతున్నందున కంది పంటకు అనుకూలంగా ఉంటుందన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షపాతం సగానికి పడిపోయినా ఈ పద్ధతి ద్వారా ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల ఉత్పత్తులు సాధించవచ్చని ఆమె వివరించారు.



వర్షాభావ పరిస్థితులలో కందిసాగుకు దోహదమయ్యే బోద కాల్వల విధానం



# ఎరువులున్నా ఇవ్వం!

### ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి - ధారూర్‌లో రైతుల పట్ల గ్రోమోర్ సిబ్బంది దురుసు ప్రవర్తన



గ్రోమోర్ సిబ్బందిని నిలదీస్తున్న రైతులు

**ధారూర్, జూన్ 18, ప్రభాతవార్త:** అన్నదాతలకు అండగా ఉండాల్సిన ఎరువుల కేంద్రాలు, నేడు రైతుల పాలిట శాపంగా మారాయి. ధారూర్ మండల కేంద్రంలోని గ్రోమోర్ కేంద్రంలో ఎరువుల నిల్వలు పుష్కలంగా ఉన్నా, కావాలనే లేవని చెబుతూ రైతులను తిప్పి పంపిస్తున్నట్లు దోర్నాల గ్రామానికి చెందిన రైతు మహిపాల్ సహా పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రోమోర్ కేంద్రానికి వెళ్లిన రైతులు ఎరువులు అడగ్గానే సిబ్బంది మొదట నిరాకరిస్తున్నారని, రైతులు గట్టిగా ప్రశ్నించేసరికి, స్టాక్ ఉన్నా మెషిన్ పని చేయడం లేదు, సర్వర్ వస్తేనే ఎరువులు ఇస్తాం అంటూ సాకులు చెబుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. సర్వర్ సాకుతో తమను గంటల తరబడి నిలబెడుతున్నారని, అదే సమయంలో ఎరువులు ఎవరికి ఇస్తున్నారో కూడా తెలియడం లేదని వారు వాపోతున్నారు. అంతేకాకుండా, మీకు తోచింది చేసుకోండి.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి, ఇప్పుడు ఇచ్చేది లేదు అని సిబ్బంది సమాధానం ఇస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. స్థానికంగా ఉన్న తమ సమస్యను మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాష్‌కు ఫోన్ చేసి మొరపెట్టుకుందామంటే, ఆయన కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల మోనం, సిబ్బంది మొండి వైఖరి చూస్తుంటే.. వ్యవసాయశాఖ అధికారుల అండతోనే వీరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. సాగు సమయం దాటిపోతోందని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ధారూర్ గ్రోమోర్ కేంద్రంపై తనిఖీలు నిర్వహించాలని, రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు అందేలా చూడాలని దోర్నాల గ్రామ రైతులు కోరుతున్నారు.



# బీమాకు ఏదీ ధీమా?

**★రూ.15.30 కోట్ల నష్టపరిహారం కోసం ఆరు నెలలుగా ఎదురుచూపులు ★అవస్థలలో 306 రైతు కుటుంబాలు**

**రంగారెడ్డి అర్బన్, జూన్19, ప్రభాతవార్త:** జిల్లాలో రైతు బీమా పథకం అమలుపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రైతు మరణించిన వెంటనే కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించి అండగా నిలిచే ఈ పథకం గతంలో వేగంగా అమలవుతుండగా, ప్రస్తుతం వందలాది కుటుంబాలు నెలల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. గత ఆరు నెలల కాలంలో జిల్లాలో మొత్తం 770 మంది రైతులు మరణించగా వారిలో 464 కుటుంబాలకు మాత్రమే బీమా సాయం అందింది. మరో 306 కుటుంబాలు ఇప్పటికీ పరిహారం కోసం ఎదురు చూస్తున్నాయి. రైతు బీమా పథకం రైతు కుటుంబాలకు అత్యంత కీలకమైన భరోసా పథకంగా గుర్తింపు పొందింది. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో తక్షణ ఆర్థిక సాయం అందించడం ద్వారా కుటుంబానికి అండగా నిలవడం దీని ప్రధాన లక్ష్యం. గత ప్రభుత్వ హయాంలో రైతు మరణం నమోదైన కొద్ది రోజుల్లోనే వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సమన్వయంతో అవసరమైన ధ్రువపత్రాలు సేకరించి బీమా క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించేవి. దీంతో రైతు కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా సాయం అందేది. అయితే ప్రస్తుతం పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. వివిధ స్థాయిల్లో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండటంతో వందలాది కుటుంబాలు బీమా సాయం కోసం నిరీక్షించాల్సి వస్తోంది. రైతు మరణించి నెలలు గడుస్తున్నా తమకు రావాల్సిన రూ.5 లక్షల పరిహారం అందలేదని పలువురు బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 464 కుటుంబాలకు రూ.23.20 కోట్ల బీమా సాయం పంపిణీ చేశారు. అయితే మిగిలిన 306 కుటుంబాలకు అందాల్సిన సాయం విలువ సుమారు రూ.15.30 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఈ మొత్తం ఇంకా విడుదల కాకపోవడంతో బాధిత కుటుంబాలు ఆర్థిక ఇబ్బందు లు ఎదుర్కొంటున్నాయి.

మండలాల వారీగా పరిశీలిస్తే కేశంపేట మండలంలో అత్యధికంగా 28 కుటుంబాలు బీమా కోసం ఎదురుచూస్తున్నాయి. షాబాద్‌లో 24, మాడుగులలో 21, శంకర్‌పల్లిలో 21, చేవెళ్లలో 19, యాచారంలో 19, ఫరూఖ్‌నగర్‌లో 18, ఇబ్రహీంపట్నంలో 18, తలకొండపల్లిలో 17, మంచాలలో 16, కడ్తాల్‌లో 14, కందుకూరులో 13, కొందుర్గులో 13, జిలేడుచౌదరిగూడలో 12, ఆమనగల్‌లో 11, శంషాబాద్‌లో 9, అబ్దుల్లాపూర్‌మెట్‌లో 8, మహేశ్వరంలో 7, నందిగామలో 7, కొత్తూరులో 6, మొయినాబాద్‌లో 5 కుటుంబాలు రైతు బీమా సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. రైతు సంఘాల నాయకులు మాత్రం పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరిం చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. రైతు మరణం తర్వాత కుటుంబానికి అందే ఈ సాయం కేవలం పరిహారం మాత్రమే కాకుండా ఆ కుటుంబానికి ఆర్థికంగా నిలబెట్టే ఆధారమని వారు పేర్కొంటున్నారు. రైతు బీమా పథకం ఉద్దేశానికి అనుగుణంగా పెండింగ్‌లో ఉన్న అన్ని క్లెయిమ్‌లను త్వరితగతిన పరిష్కరించి బాధిత కుటుంబాలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో రైతు బీమా అందకపోవడం వల్ల అనేక కుటుంబాలు అప్పులు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాయి. ఒకప్పుడు రైతు కుటుంబాలకు ధీమాగా నిలిచిన రైతు బీమా మళ్లీ అమలవుతుందా లేదా అన్న ప్రశ్న చర్చనీయాంశంగా మారింది.

# ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అధికారం బిఆర్ఎస్‌దే

### గ్రామాల్లో పార్టీని పటిష్టం చేయాలి

### కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటా

### మాజీ మంత్రి సబితారెడ్డి



బిఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

**చేవెళ్ల, జూన్ 18, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగిన బిఆర్ఎస్ ఆధికారంలోకి రావడం ఖాయమని, గ్రామాల్లో బిఆర్ఎస్‌ను మరింతగా పటిష్టం చేసేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఏమ్మెల్యే పట్లోళ్ళ సబితారెడ్డి సూచించారు. గురువారం చేవెళ్లలోని అట్లాస్ ఫంక్షన్ హాల్‌లో చేవెళ్ల నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఏమ్మెల్యే పట్లోళ్ళ సబితారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం ఎప్పుడు ఎ ఎన్నికలు జరిగిన అధికారంలోకి బిఆర్ఎస్ పార్టీ రావడం తధ్యమన్నారు. బిఆర్ఎస్ పార్టీని కష్టకాలంలో అండగా ఉన్న కార్యకర్తలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. పార్టీకి పని చేసిన ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తిస్తుందన్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం బిఆర్ఎస్ నాయకులు పోరాటం చేయడంతో పాటు వాటిని పరిష్కరించాలన్నారు. సిఎం రెవంత్‌రెడ్డి పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సిఎం రెవంత్ రెడ్డికి దమ్ముంటే సహకారం సంఘం ఎన్నికలు జరిపించాల సవాల్ చేశారు. కాంగ్రేస్ ప్రభుత్వం ప్రచారంకు తప్ప అభివృద్ధిపై దృష్టి సారించడంలేదన్నారు.

**సీటీ కమిషనరేట్‌పై అసెంబ్లీలో చర్చిస్తా**

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హమీలను అమలు చేయడం మరిచి సోంత పనులపైన దృష్టి సారించారన్నారు. పోలీస్ వ్యవస్థను మూడు ముక్కలుగా చేసి చేవెళ్ల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లను కమిషనరేట్‌లో విలినం చేసి ప్రజలకు మరింత దూరం పోలీస్ సేవలు చేసిందన్నారు. ఫ్యూచర్ సీటీ కమిషనరేట్‌పై అసెంబ్లీలో చర్చిస్తామన్నారు. ఎస్ఐఆర్‌లో గ్రామాల్లో ఓటర్లు తోలగించకుండా చూడాల్సిన భాద్యత బిఆర్ఎస్ పార్టీ నాయకులపై ఉందన్నారు.

**పరిషత్ సంస్థలపై గులాబీ జెండా ఎగరాలి**

చేవెళ్ల, మహేశ్వరం, రాజేంద్రనగర్ నియోజ కవర్గాల్లోని ప్రజల కోసం నిరంతర పాటుపడుతామన్నారు. మూడు నియోజకవర్గాల్లో రానున్న ఎంపిటిసి జడ్‌పిటిసి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు పాటు పడాలన్నారు. ఈ నెల 25వ తేదిన నియోకవర్గ స్థాయి బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంను చేవెళ్ల మండలం కేంద్రంలోని పద్మావతి కన్‌వేన్షన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ వర్కింగ్ అద్యక్షుడు కెటిఆర్ ముఖ్య అతిధిగా పాల్గోంటారి, నియోజకవర్గంలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, మొయినాబాద్, నవాబ్‌పేట్ మండలంలోని నాయకులు, కార్యకర్తలు పోల్గాని కోరారు. ఈ కార్యకమంలో బూత్ కమిటి నియోజకవర్గ ఇంచార్జి రాంబాబు, రాష్ట్ర నాయకుడు నాగేందర్‌గౌడ్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ పి.క్రిష్ణారెడ్డి, చేవెళ్ల నియోజవర్గం బిఆర్ఎస్ పార్టీ మాజీ ఇంచార్జి దేశమోళ్ల అంజనేయులు, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ రంగారెడ్డి, మండల పార్టీ అద్యక్షుడు ప్రభాకర్, కౌన్సిలర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, మంగమ్మమల్లేష్, సువర్ణచందు, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నత్తి క్రిష్ణారెడ్డి, కమకమామిడి మల్లారెడ్డి, పెంజర్ల అనంతరెడ్డి, గుడిపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, మాదవరెడ్డి, మాదవగౌడ్, బేగరి నర్సింలు, రామగౌడ్, రాజమల్లేష్, క్రిష్ణా, శంకరయ్య, గోనే కరుణాకర్‌రెడ్డి, రాంప్రసాద్, రాజు, రవికుమార్, సర్పంచ్ మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ శివారెడ్డి, తలారి యాదయ్య, మహ్మద్ ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

# మెనూ మిస్ అవ్వద్దు

### నాణ్యతలో రాజీ లేదు

### కాలపరిమితి దాటిన సరుకులు బయట పారేయండి

### మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు కలెక్టర్ ఆదేశం



**పెద్దేముల్, జూన్ 18, ప్రభాతవార్త:** వసతి గృహాల్లో మెను ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు. గురువారం తాండూరు మునిసిపల్ పరిధిలో జిల్లా కలెక్టర్ పర్యటించి వివిధ అభివృద్ధి పనులతో పాటు వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డంపింగ్ యార్డు నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. మిషన్ భగిరథ మంచినీటి ట్యాంకు పనులను నాణ్యతతో చేపట్టాలని అన్నారు. శాంతినగర్ పార్కులో వివిధ పరికరాలను సమకూర్చి అభివృద్ధి పరచాలని ఆదేశించారు. 2బిఎచ్‌కే ఇళ్ళ నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి మౌళిక సదుపాయాలతో సిద్ధం చేయాలని అన్నారు. గిరిజన, మైనార్టి బాలికల సంక్షేమ వసతి గృహాలలో వంట గది, నిత్యావసర సరుకుల నిల్వ గదిని పరిశీలించారు. గడువు తేది పూర్తయిన సరుకులను వాడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆకస్మిక తనిఖీల్లో మునిసిపల్ కమిషనర్ రాకేష్‌రెడ్డి, హౌసింగ్ డీఈ మహమ్మద్ ఖలీముద్దిన్ పాల్గొన్నారు.

# యమశకటమైన లారీ..

### ఒకే కుటుంబంలో ముగ్గురిని బలితీసుకున్న ప్రమాదం

### కొండగట్టు అంజన్న దర్శనం చేసుకుని వస్తుండగా ఘోరం

**మేడ్చల్, జూన్ 18, ప్రభాతవార్త :** కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ఎంతో ఆనందంగా ఇంటి బాట పట్టిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని విధి ఘోర రోడ్డు ప్రమాదం రూపంలో కబళించింది. కొద్ది గంటల క్రితం వరకు నవ్వులు పూయించిన ఆ కుటుంబంలో అనుకోని ప్రమాదం కన్నీటి ప్రవాహాన్ని మిగిల్చింది. ఈ విషాద ఘటన గోదావరిఖని ప్రాంతాన్ని తీవ్ర శోకసంద్రంలో ముంచెత్తింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గోదావరిఖనికి చెందిన చంద్రశేఖర్, ఆయన భార్య రేఖ, వారి ఇద్దరు కుమారులు లోహిత్, నిహాల్‌లు కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని కారులో తిరుగు ప్రయాణమయ్యారు. అర్ధరాత్రి దాటిన తర్వాత మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజీవ్ రహదారిపై మురహరిపల్లి గ్రామం సమీపానికి చేరుకోగానే వీరి జీవితాల్లో ఊహించని విషాదం చోటుచేసుకుంది. ఎదురుగా అతివేగంగా వచ్చిన ఒక భారీ లారీ వీరి కారును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాద తీవ్రతకు కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయి, అందులోని వారంతా ఇనుప ముక్కల మధ్య ఇరుక్కుపోయారు.

**కళ్లముందే జరిగిన ఘోరం:**

అదే సమయంలో వెనుకనే మరో మిగతా 3లో


మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## ఘనంగా వన మహోత్సవం

**శంషాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :** భవిష్యత్తు తరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం శంషాబాద్ మండలం పరిధిలోని మల్కారం గ్రామంలో ఈరోజు ఘనంగా వన మహోత్సవం కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులు, అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వృక్షసంపదను పెంపొందించడం, పర్యావరణ పరిరక్షించుకోవడం మన అందరి సామాజిక బాధ్యత అని గుర్తుచేశారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలిని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటడమే కాకుండా, వాటిని కంటికి రెప్పలా సంరక్షించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు మరియు మల్కారం గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### ప్రయాణికుడి వద్ద 374 గ్రాముల బంగారం స్వాధీనం

**శంషాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :** శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్ పోర్టులో ఇంటర్నేషనల్ అరైవల్స్ వద్ద కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.మలేషియా రాజధాని కౌలాలంపూర్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ప్రయాణికుడిపై అధికారులకు అనుమానం వచ్చిన తనిఖీలు చేయగా రహస్యంగా దాచిన బంగారం బయటపడింది.వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద 374 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.అయితే పట్టుబడిన బంగారం విలువ అంతర్జాతీయ మార్కెట్లో సుమారు 55లక్షల రూపాయలు ఉంటుందని అధికారులు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న బిఆర్ఎస్ నేతలు

### మండల కేంద్రంలోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**జిల్లేడు చౌదరి గూడెం, జూన్ 18, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోనే నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించాలని కోరుతూ బిఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ జగదీశ్వర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాల్పాడు లో పోలీస్ స్టేషన్ భవనం ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. జిల్లేడు చౌదరిగూడ మండలంలోని గ్రామాలన్నీ దగ్గరలో ఉన్నాయని అన్నారు. లాల్పాడులో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం వలన మండల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలిపారు. పోలీసు అధికారులు ప్రజా ప్రతినిధులు మరోసారి పునరాలోచన చేసి చౌదరి గూడ మండల కేంద్రంలో నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, మోనో చారి, కొండి యాదయ్యా, మనయ్యా, ఎంపీటీసీ రాములు, నర్సింలు, మోతిలాల్, జంగిరి, వెంకటయ్యా, జెబ్బర్, సర్పంచ్ రాంచరణ్, శేఖర్, శ్రీనివాస్, ధీమా గణేష్, శేఖర్ ,యాదయ్యా, హసీబ్, హర్షద్, మల్లేష్, మల్లేష్, సత్యం, భాస్కర్ పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న సిఐటియూ నాయకులు

### కనీస వేతనం రూ.26వేలు ఇవ్వండి

**మేడ్చల్, జూన్ 18. ప్రభాతవార్త :** మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఎల్లంపేట మున్సిపల్ కార్యాలయంలో సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మేడ్చల్ మండల కార్యదర్శి నరేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు మే నెల జీతాలు ఇప్పటివరకు ఇవ్వకపోవడం వల్ల అనేక రకాలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నాడు. అదేవిధంగా మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని, ఢిల్లీ, హర్యానా రాష్ట్రాల్లోలాగా మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలని, మున్సిపల్ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇందిర ఇండ్లు ఇవ్వాలని కోరాడు. మున్సిపల్ కార్మికులకు ఇప్పటివరకు కనీస సౌకర్యాలు ఇవ్వకుండా సంవత్సరాలు గడుస్తున్నా వాటి గురించి పట్టించుకోకపోవడం దుర్మార్గం అని ఇప్పటికైనా వారికి ఇవ్వాల్సిన బట్టలు, సబ్బులు, షాంపులు, చెప్పులు, గ్లౌజులు జాడుకట్టలు, షూస్, టార్చ్‌లైట్, హెల్మెట్ తదితర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశాడు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్ మండల ఉపాధ్యక్షుడు డి నరసింగరావ్, మున్సిపల్ కార్మికులు సత్యనారాయణ, నర్సమ్మ, లక్ష్మి, రేణుక, రత్నం తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మేడ్చల్, జూన్ 18. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నైబర్‌హుడ్, లక్ష్మీనగర్ ఫీడర్ ఏరియాలో నేడు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్‌శాఖ గుండ్లపోచంపల్లి ఏఈ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చెట్ల కొమ్మల తొలగిస్తున్నందున నైబర్‌హుడ్ ఫీడర్ పరిధిలో ట్రిడెంట్ ప్రాపర్టీస్, ఊర్జిత విల్లాస్ 1, నైబర్‌హుడ్ విల్లాస్, ఏజీ సైట్ కాలనీ, శ్రీ కృష్ణ అపార్ట్‌మెంట్స్, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో నేడు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. అదే విదంగా లక్ష్మీనగర్ ఫీడర్ పరిధిలోని లక్ష్మీనగర్, మణిక్‌రెడ్డి నగర్, ఊర్జిత విల్లాస్ 2, 3, సంజనాస్ అపార్ట్‌మెంట్స్, ప్రైమస్ ఎప్సిలాన్స్, ప్రెస్టేజ్ గ్రీన్ ప్రాంతాల్లో నేడు మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కరంట్ సరఫరాను ఉండదని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### ఇంటింటా 'ఇందిరమ్మ' శోభ

**జిల్లేడు చౌదరి గూడెం, జూన్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో ఇంటింటా ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని రావిరాల గ్రామపంచాయతీ వీరసముద్రం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో అయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం శరవేగంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. మొదటి విడతలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రాజకీయాలకు పార్టీలకు అతీతంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని ఆయన పేర్కొన్నారు. రెండో విడతలో మరిన్ని ఇండ్లు మంజూరు చేసి పేదోడి సొంతింటి కల సహకరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చలివేంద్రం పల్లి రాజు రావిరాల సర్పంచ్ నీలయ్య ఉపసర్పంచ్ జంగయ్య మండల నాయకులు సత్యనారాయణ ఆంజనేయులు రజిత సలీం యాదయ్య నర్సింలు బాలాజ్ పీర్జాపూర్ సర్పంచ్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# వేకువజామునుంచే సెర్చ్ ఆపరేషన్

### 45 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు సీజ్

**పరిగి, జూన్ 18, ప్రభాతవార్త :** అసాంఘీక కార్యకలాపాల నివారణకు, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా కార్డన్ సెర్చ్‌తో పోలీసు అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. గురువారం, వికారాబాద్ జిల్లా పరిగి మండలం మల్లెమోనిగూడలో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు పరిగి డివిజన్ పరిధిలో డిఎస్పి శ్రీనివాస్ నేతృత్వంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.. సోమవారం తెల్లవారుజామున ఉ.5గం నుండే డీఎస్పీ శ్రీనివాస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో భారీ కమ్యూనిటీ కాంటాక్ట్ (కార్డన్ అండ్ సెర్చ్) ఆపరేషన్ నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని, పరిసరాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు, 1 కారుతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా నిల్వ ఉంచిన 39 లీటర్ల అక్రమ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 31 చలాన్లు నమోదు చేసి, రూ. 12,245/ జరిమానా విధించారు. సెర్చ్ లో భాగంగా పలువురు అనుమానిత వ్యక్తులకు పాప్ లాన్ డివైస్ ద్వారా తనిఖీ లు చేశారు. డిఎస్పి మాట్లాడుతూ, గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా భాద్యత వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలగిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. దాదాపు 160 పైగా పోలీసు బలగాలతో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గ్రామ ప్రజలతో ప్రత్యేకంగా సమావేశమై వివిధ సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కల్పించారు.. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల ప్రాధాన్యతను వివరిస్తూ, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలలో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సైబర్ నేరాలు, డ్రగ్స్ కు దూరంగా యువత ఉండాలని హెచ్చరించారు. బాల్య వివాహాల నిర్మూలన, పోక్సో చట్టం, మహిళల భద్రత, ఆస్తిపాస్తుల రక్షణ, రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన రహదారి భద్రత నియమాలపై ప్రజలకు, యువతకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో పరిగి సిఐ కొండల్ రెడ్డి, కొడంగల్ సిఐ శ్రీధర్ రెడ్డి, పరిగి సబ్ డివిజన్ ఎస్.ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న డిఎస్పి శ్రీనివాస్

# బిఆర్ఎస్ సమావేశాన్ని విజయవంతం చేయాలి

**శంషాబాద్, జూన్ 18, ప్రభాతవార్త :** నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి విజయవంతం చేయాలని పలువురు బిఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు. గురువారం శంషాబాద్ జిహెచ్ఎంసిలోని కొత్వాలుగుడా డివిజన్ అధ్యక్షులు కొనమొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 21వ తేదీన జెడి కన్వెన్షన్‌లో రాజేంద్ర నగర్ నియోజకవర్గ ఇంఛార్జ్ పట్లోళ్ల కార్తిక్ రెడ్డి అధ్యక్షతన జరగబోయే నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశానికి సంబంధించిన ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం పలువురు బిఆర్ఎస్ నేతలు మాట్లా డుతూ... ఈనెల 21న జరగబోయే నియోజకర్గస్థాయి సమావేశానికి ముఖ్య అతిథిగా బిఅరెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిలు అతిథులు హాజరైకానున్నారని కావున బిఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున్న సమావేశానికి హాజరైయ్యే విధంగా కష్టపడాలని కొనమొల్ల శ్రీనివాస్ దిశా నిర్దేశం చేశారు.అదే విదంగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో బిఎల్ఏలు ఎలా పనిచేయాలి అనే అంశపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొనమొల్ల శ్రీనివాస్ తో పాటు సీనియర్ నాయకులు మల్లేష్ ముదిరాజ్, మాడపాటి నరేందర్ , 118,119 డివిజన్ల ఆర్గనైజింగ్ సెక్రటరీ రాచమల్ల జయసింహ, 119 డివిజన్ ప్రధాన కార్యదర్శి పరందములు, ఉపాధ్యక్షులు పెడిరిపాటి మురళి, రాచమల్ల కార్తిక్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమేష్ రాథోడ్, సంయుక్త కార్యదర్శి ప్రవీణ్ గౌడ్,యూత్ అధ్యక్షుడు, పవిత్ర సాగర్, జనరల్ సెక్రటరీ పెట్రోల్ సాయి, శివ గౌడ్ , దీపక్ గౌడ్, చిన్నగండు అరుణ్, కిట్టు,ఎస్సి సెల్ అధ్యక్షుడు రాచమల్ల రమేష్, బిసి సెల్ అధ్యక్షుడు కొమ్మూరి విజయ్ గౌడ్, ఉపాధ్యక్షుడు సతీష్ యాదవ్, సీనియర్ నాయకులు మాక్బుల్, యువ నాయకులు, అరవింద్, రోహిత్, శేఖర్ యాదగిరితో పాటు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బిఆర్ఎస్ నేతలు

# విలువలతో కూడిన విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

**జిల్లేడుచౌదర్‌గూడెం, జూన్ 18, ప్రభాతవార్త:** విలువలతో కూడిన విద్యతోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం చౌదరిగూడెం మండలం లాల్ పహాడ్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన భాష్యం పబ్లిక్ స్కూల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని పాఠశాల యాజమాన్యానికి సూచించారు. విద్యను వ్యాపారంగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించి గ్రామీణ ప్రాంతాల నిరుపేద విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలుస్తోందని అయన పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడం, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం ఇందుకు నిదర్శనమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందిస్తూ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. రాబోయే రోజుల్లో తెలంగాణలో విద్యను అభ్యసించేందుకు దేశ నలుమూలల నుంచి విద్యార్థులు వచ్చే పరిస్థితి ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, సీనియర్ నాయకులు కేకే కృష్ణ, చలివేంద్రంపల్లి రాజు, సత్యనారాయణ రెడ్డి, ఆంజనేయులు, రజిత, సలీం, నాగేందర్, గోబ్రా నాయక్, యాదయ్యా, బాలరాజ్, సర్పంచులు బోయ రామచంద్రయ్యా, నీలయ్యా, బందయ్యా, జంగయ్యా, నర్సింలు, అరుణ తదితరులు పాల్గొన్నారు




మాట్లాడుతున్న డిఆర్వో స్వర్ణలత

### సర్ ప్రక్రియకు రాజకీయ పార్టీలు సహకరించాలి

**కోట్‌పల్లి, జూన్ 18, ప్రభాతవార్త:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఎస్ఐఆర్‌కు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని డిఆర్వో స్వర్ణలత అన్నారు. గురువారం నాడు వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అమె మాట్లాడుతూ. బాధ్యత అర్హులైన ఓటర్ల నమోదు, అనర్హుల తొలగింపు, పేర్లు, చిరునామాల సవరణ వంటి ఆంశాలల్లో బిఎల్ఓలకు సహకరించాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్ర కీలకమన్నారు. బూత్‌స్థాయిలో పార్టీ ప్రతినిధులు ఓటరు జాబితాను క్షుణంగా పరిశీలించి ఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై ప్రజలకు సహాయం చేస్తూ ఓటర్ల జాబితాపై పిర్యాదులు అభ్యంతరాలను సకాలంలో సమర్పించాలన్నారు. ఎస్ఐఆర్‌పై రాజకీయ పార్టీల ప్రతి నిధులు అడిగిన ప్రశ్నలు అనుమానాలకు నివృతి చేసి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ అనంద్‌రావు, రాజకీయ పార్టీల నాయకులు సిబ్బంది, సతీష్, రమేష్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

### చేవెళ్ల బిజెపి ప్రధాన కార్యదర్శిగా సత్యనారాయణ

**చేవెళ్ల, జూన్ 18, ప్రభాతవార్త:** చేవెళ్ల మున్సిపల్ భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా పత్తి సత్యనారాయణ ఎన్నికయ్యారు. దేవునిఎర్రవల్లి గ్రామానికి చేందిన పత్తి సత్యనారాయణను ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసింది. పార్టీ అభివృద్ధికి పని చేసినందుకు తనకు పదవిని కట్టబేట్టినందుకు ప్రతి ఒక్కరికి చేవెళ్ల మున్సిపల్ భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి పత్తి సత్యనారాయణ కృతజ్నలు తెలిపారు. పార్టీకి నిరంతరం పని చేస్తామన్నామని నూతన బిజెపి ప్రధాన కార్యదర్శి ఎన్నికైన సత్యనారాయణ తెలిపారు.

### వరద విపత్తును ఎదుర్కొనేందుకు మాక్ డ్రిల్

**మేడ్చల్, జూన్ 18. ప్రభాతవార్త :** రాబోయే వర్షాకాలంలో సంభవించే అత్యవసర పరిస్థితులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలలో భాగంగా మేడ్చల్ సర్కిల్ 60 పరిధిలో అధికారులు సమగ్ర మాక్ డ్రిల్ నిర్వహించారు. నీటి నిల్వల నివారణ చర్యలు, వర్షపు నీటి కాలువల నిర్వహణ, అత్యవసర సేవల పునరుద్ధరణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతా చర్యలు మరియు అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన స్పందన వంటి అంశాలను ప్రదర్శించారు. వర్షాకాలానికి సంబంధించిన అత్యవసర పరిస్థితులను ఎదుర్కో వడంలో వివిధ శాఖల సంసిద్ధత, సమన్వ యం, స్పందనా సామర్థ్యాన్ని అంచనా వేశామని ఈ సందర్భంగా మేడ్చల్ డిప్యూటీ కమిషనర్ సుధాంష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ విభాగం, ట్రాఫిక్ పోలీస్, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ, టీజీఎస్‌పీడీసీఎల్, హైడ్రా, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, అర్బన్ బయోడైవర్సిటీ డివిజన్, పారిశుద్ధ్య విభాగాల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.





కొడంగల్ పోలీస్‌స్టేషన్‌లో తనిఖీకి వచ్చిన డిఎస్‌పి

### పోలీసు వ్యవస్థపై నమ్మకం పెరిగేలా కృషి

**కొడంగల్, జూన్ 18, ప్రభాతవార్త :** పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకాన్ని కలిగించేలా పోలీసులు విధులు నిర్వహించాలని పరిగి డీఎస్పీ శ్రీనివాస్ అన్నారు.గురువారం కొడంగల్ పోలీస్‌స్టేషన్‌ను తనికీ చేశారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించిన డిఎస్పీ అనంతరం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో నేరాలు,ఘోరాలను పరిశీలించిన ఆయన పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. అలాగే దొంగతనాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తు రోడ్డు ప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదగా వ్యవహరిస్తు పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచే విధంగా ఉద్యోగం నిర్వహించాలని తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌రెడ్డి,ఎస్సై జీవీ.సత్యనారాయణ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# రాష్ట్రానికే ఆదర్శం శామీర్‌పేట సహకార సంఘం

**శామీర్‌పేట, జూన్ 18, ప్రభాతవార్త :** శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘం అభివృద్ధి రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) ద్వారా సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లుగా ఎంపికైన శిక్షణార్థులు ప్రశంసలు వ్యక్తం చేశారు. గురువారం శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘంను రాజేంద్రనగర్‌లోని సహకార శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా క్షేత్రపర్యటనలో సుమారు 50మంది ఆ ట్రైనీలు సందర్శించి సంఘం పనితీరును తెలుసుకున్నారు. శామీర్‌పేట సహకార సంఘం వివిధ రంగాల్లో శిక్షణ పొందుతున్న వారికి నిలయంగా మారింది. రాష్ట్రంలోని వివిధ సంఘాలకు కూడ మార్గదర్శకంగా ఈ సంఘం మారి గుర్తింపు పొందింది. ఈ సంఘం ద్వారా రైతులకు అందిస్తున్న సేవల గురించి శిక్షణ పొందుతున్న వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగ శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘం ఛైర్మన్ డా.రామిడి మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ పొందుతున్న సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లకు సంఘం పనితీరును, సేవలను సంఘం కార్యకాలపాలు, అభివృద్ధి కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు. 2020లో నూతన పాలకవర్గం బాధ్యతలు చేపట్టిన అనంతరం సంఘం సాధించిన ప్రగతి, రైతు సంక్షేమం కోసం అమలు చేసిన పలు కార్యక్రమాల గురించి వివరించారు. రైతులకు పంట రుణాలు, ధీర్ఘకాలిక రుణాలు, వరి కొనుగోలు కేంద్రాల నిర్వాహణ, ఎరువుల సరఫరా, నాణ్యమైన విత్తనాల పంపిణీ, రైతు అవసరాలకు అనుగుణంగ అందిస్తున్న వివిధ సేవలను వారికి వివరించి అవగాహణ కల్పించారు. గతంలో నష్టాల్లో ఉన్న ఈ సంఘాన్ని పారదర్శక పాలన చేస్తూ సమర్ధవంతమైన నిర్వాహణ ద్వారా లాభాల బాటలో నడిపించి రాష్ట్రంలో ఆదర్శ సంఘంగా తీర్చిదిద్దిన విషయాన్ని ఆయన తెలియజేశారు. అదే విధంగా సంఘానికి మౌళిక వసతుల కొరత వంటి అనేక సవాళ్లను ఎదురైనప్పటికీ వాటిని అధిగమిస్తూ రైతులకు నిరంతర సేవలు అందించిన విధానాన్ని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోనే ఈ సహకార సంఘం ఆదర్శంగా నిలిచిందని, గుర్తింపు పొందినట్లు దీని వెనక ఉన్న కృషి ప్రణాళిక బద్ధమైన అభివృద్ధి కార్యక్రమాల గురించి ఆయన వివరించారు. అయితే సంఘం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు, రైతు సేవా కార్యక్రమాలు, ఆధునిక నిర్వాహణ విధానాలను పరిశీలించిన శిక్షణ పొందుతున్న వారు హర్షం వ్యక్తం చేశారు.గ్రామీణాభివృద్ధిలో, రైతు సంక్షేమంలో సహకార సంఘాల పాత్ర అత్యంత కీలకమని, శామీర్‌పేట సహకార సంఘం రాష్ట్రంలోని ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలుస్తోందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ సహకార శిక్షణ సంస్థ ప్రిన్సిపల్ ప్రసాద్, శామీర్‌పేట సొసైటీ వైస్‌చైర్మన్ ఐలయ్యయాదవ్, డైరక్టర్లు నర్సింలు, బిక్షపతి, సంఘం కార్యదర్శి రవి, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, శిక్షణార్థులు తదితరులు పాల్గొన్నారు.


శామీర్‌పేట సొసైటీని సందర్శించిన ట్రైనీలతో మాట్లాడుతున్న చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాధికాగుప్తా

### డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరిస్తా

**కీసర, జూన్18, ప్రభాతవార్త :** ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని రాంపల్లి నుండి చర్లపల్లి మార్గంలోని డంపింగ్‌యార్డులో రాత్రి వేళల్లో చెత్తను కాల్చడం వల్ల కాలనీల వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించడానికి గురువారం జోనల్ కమిషనర్ రాధికాగుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డంపింగ్ యార్డులోని చెత్తను తక్షణమే తొలగించాలని, వాహనాల రాకపోకలకు ఒకే మార్గాన్ని ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు కౌకుట్ల జీవన్‌రెడ్డి, ఆల్ కాలనీ అధ్యక్షులు వేణుగోపాల్, కాలనీవాసులు రాంరెడ్డి, రామక్రిష్ణ పాల్గొన్నారు.


కలెక్టర్ మనుచౌదరికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి

### వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠామహోత్సవానికి ఆహ్వానం

**కీసర, జూన్18, ప్రభాతవార్త :** రాంపల్లిదాయర గ్రామంలోని వెంకులో నిగుట్టలో హేమాద్రి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 19వ తేదీన జరుగనున్న ప్రతిష్ట మండల పూజా మహోత్సవంలో పాల్గొనాలని ఆలయ చైర్మన్ కందాడి హనుమంత్‌రెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్ల మధుసూధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

**శంషాబాద్, జూన్ 18,ప్రభాతవార్త :** ఓ మహిళ తన ఇద్దరు చిన్నారులతో కలిసి అదృశ్యమైన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సిఐ నరేందర్ రెడ్డి వివరాల ప్రకారం... మొదటి భార్యతో విడిపోయిన అనం తరం మే 20న అయేషా బేగం (23)ను సయ్యద్ అమీర్ అలీ (42) రెండో పెళ్లి చేసుకున్నాడు. శంషాబాద్ మండలం లోని ఉట్‌పల్లి గ్రామంలోని ఇందిరనగర్ దోడ్డిలో రెండో భార్య అయేషా బేగం (23) గత వివాహం ద్వారా ఆమెకు పుట్టిన పిల్లలు అబ్దుల్ రెహ్మాన్ (7), అలీషా (5)లతో కలిసి భర్త సయ్యద్ అమీర్ అలీ ఉంటున్నారు. అయితే బుధవారం ఉదయం 9 గంటల సమయంలో భర్త పనిమీద బయటకు వెళ్లి, గంట తర్వాత తిరిగి ఇంటికి వచ్చేసరికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఇంట్లో కనిపించలేదు. ఆమె మొబైల్ ఫోన్‌కు పలుమార్లు కాల్ చేసినప్పటికీ స్పందన రాలేదు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ వారి ఆచూకీ లభించకపోవడంతో బాధితుడు శంషాబాద్ పోలీసులను ఆశ్రయించాడు.ఈ మేరకు శంషాబాద్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


పిల్లలతో అదృశ్యమైన అయేషా బేగం (ఫైల్ ఫోటో)

### నేడు ఎస్ఐఆర్ మ్యాపింగ్‌పై శిక్షణ

**కోట్‌పల్లి, జూన్ 18, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నాడు ఉదయం పది గంటలకు ఎస్ఐఆర్, మ్యాపింగ్‌పై బిఎల్ఓలు, బిఎల్ఏలకు మాస్టర్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ అనంద్‌రావు తెలిపారు. ఈకార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు, బిఎల్ఓలు, బిఎల్ఏలు ఈ శిక్షణ కార్యక్రమానికి అందరు హాజరు కావలని పేర్కొన్నారు.

### నూతన వ్యవసాయ అధికారిగా తులసి బాధ్యతలు

**దౌల్తాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండల నూతన వ్యవసాయ అధికారి (ఎఓ)గా తులసి బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ ఏఓగా విధులు నిర్వహించిన లావణ్య పూడురూ మండలానికి బదిలీ కావడంతో ఆమె స్థానంలో తులసి నియమితులయ్యారు. ఇప్పటివరకు జిల్లా వ్యవసాయ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తులసి, బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఏఓ తులసి విలేకరులతో మాట్లాడారు. మండలంలోని రైతులకు తానూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. సాగులో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని త్వరితగతిన పరిష్కరించడానికి నిరంతరం కృషి చేస్తానని ఈ సంధర్భంగా ఆమె తెలిపారు.

### తిమ్మారెడ్డిపల్లిలో అల్పాహార పథకం ప్రారంభం

**దౌల్తాబాద్, జూన్ 18, ప్రభాతవార్త:** దౌల్తాబాద్ మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో గురువారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యా ర్థులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఉచిత అల్పాహారం (బ్రెక్ ఫాస్ట్)తో పాటు పాలను పంపిణీ చేశారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ, పౌష్టికాహార పెంపకమే ధ్యేయంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిం దని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానికులు రఫీ, రాకేష్, రవి, పి.మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాలో ఆగని అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

స్థాయి అధికారులను ఆదేశించారు. ఇదే పట్టణానికి చెందిన బట్టల వ్యాపారి గుర్రం సతీష్‌కుమార్ అనే గ్యాస్ వినియోగదారుడు తనకు వచ్చిన మెసేజ్‌పై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గుమాస్తానగర్‌లో ఉమ్మడి కుటుంబంలో ఉన్న తాము డోర్ క్లోజ్ చేసినట్లు మెసేజ్ రావడంపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇలాంటి మెసేజ్‌లు చాలామందికి వచ్చాయని తెలిపారు. యాలాల మండలం పగిడ్యాల గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడికి యేడాది కాలంగా గ్యాస్ సరఫరా జరుగడం లేదు. కానీ ప్రతినెలా సరఫరా చేస్తున్నట్లు మెసేజ్ వస్తోంది. విశేషమేమిటంటే సదరు ఉపాధ్యాయుడు గత రెండేళ్లుగా తాండూరులో స్థిరపడ్డారు. కానీ పగిడ్యాల గ్రామంలో ఉన్న ఆయన ఇంటికి గ్యాస్ సప్లై చేస్తున్నట్లు మెసేజులు వస్తున్నాయి. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.

## యమశకటమైన లారీ..

(మొదటి పేజీ తరువాయి)

వాహనంలో వస్తున్న వారి బంధువు రాజశేఖర్ కుటుంబ సభ్యులు పెద్ద శబ్దం వినిపించడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ముందున్న కారు పూర్తిగా ధ్వంసమై ఉండటం చూసి పరుగెత్తుకుంటూ వెళ్లగా, కొద్ది నిమిషాల క్రితం వరకు తమతో నవ్వుతూ మాట్లాడిన చంద్రశేఖర్ రక్తపు మడుగులో పడి ఉండటం చూసి వారు కన్నీరుమున్నీరయ్యారు.

**చికిత్స పొందుతూ భార్యాపిల్లలు మృతి**

స్థానికులు, పోలీసులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి కారులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆ తర్వాత ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆయన భార్య రేఖ, చిన్న కుమారుడు నిహాల్ కూడా ప్రాణాలు కోల్పోయారు.

**ప్రాణాలతో పోరాడుతున్న పెద్ద కుమారుడు**

ఈ ప్రమాదంలో చంద్రశేఖర్ పెద్ద కుమారుడు లోహిత్ తీవ్రంగా గాయపడి, తొడ ఎముక విరగడంతో పాటు శరీరమంతా బలమైన గాయాలై ప్రస్తుతం ఆసుపత్రిలో ప్రాణాలతో పోరాడుతున్నాడు . ఒకే ప్రమాదంలో తల్లిదండ్రులను, తమ్ముడిని కోల్పోయి అనాథగా మారిన లోహిత్ పరిస్థితి చూసి ప్రతి ఒక్కరి హృదయం ద్రవిస్తోంది. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఎంతో సంతోషంగా ఫోటోలు దిగి, ఇంటికి చేరి ఆ అనుభవాలను పంచుకోవాలనుకున్న ఆ కుటుంబానికి భక్తి యాత్రే చివరి యాత్రగా మారింది. కొద్దిసేపటి క్రితమే ఫోన్లో మాట్లాడాం... ఇలా జరుగుతుందని కలలో కూడా ఊహించలేదు.. అంటూ బంధువులు, స్థానికులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మేడ్చల్ పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నారు

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**చేవెళ్ల, జూన్ 18, ప్రభాతవార్త :** ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పని చేస్తున్నామని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పామెనలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంబించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో చేవెళ్ల ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిమర్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఇళ్ళులేని నిరుపేదలకు ఇళ్లను కట్టించిన ఘనత సిఎం రెవంత్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామాల్లో సోంతింటి కళ నేరవెరిందన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమతావెంకట్‌రెడ్డి,వైస్ చైర్మన్ రాముగౌడ్, చేవెళ్ల మార్కెట్ కమిటి చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, కౌన్సిలర్‌లు బండారి శైలజ ఆగిరెడ్డి, గోపాల్‌రెడ్డి, క్రిష్ణానాయక్,మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివవాస్‌గౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ పాండు,మాజీ పర్పంచులు జనార్ధన్‌రెడ్డి,పడాల ప్రభాకర్, మాజీ ఎంపిటిసి రవీంర్‌రెడ్డి తదితరులు పాల్గోన్నారు.

## పర్యావరణాన్ని సంరక్షించాలి

**వికారాబాద్, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటు పర్యావరణాన్ని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలో పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పి, మున్సిపల్ చైర్మెన్ గడ్డం అన్యన్య, అదనపు కలెక్టర్ వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్ లతో కలిసి మొక్కలు నాటారు . ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని అన్నారు. జిల్లా ఎస్పి స్నేహ మె హ్రా మాట్లాడుతూ, పచ్చదనం పెంపొందించడం ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని సాధించవచ్చన్నారు. ప్రతి పౌరుడు కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ శాఖల అధికారులు,సిబ్బంది, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారులు, శ్యాం, పశు సంవర్ధక శాఖా అధికారి సదానందం, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

**ధారూర్, జూన్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు, మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మొత్తం 58 మంది లబ్ధిదారులకు రూ.58,06,728 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా, మండల పరిధిలోని వివిధ క్లస్టర్ల రైతులకు సుమారు 7 క్వింటాళ్ల విత్తనాలను అందజేశారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించారు. ఈ సందర్భంగా చైర్మన్,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను సరఫరా చేయడం ద్వారా వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సాజిదా బేగం,వికారాబాద్ డిసిసి కార్యదర్శి బాబా ఖాన్, మాజీ జడ్పీటీసీ కుక్కింద రాములన్న, మండల వ్యవసాయ అధికారి సూర్యప్రకాశ్, పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

## ఎంపీవో షఫీ ఉల్లా ఖాన్‌కు ఘన వీడ్కోలు

**ధారూర్, జూన్ 18, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలో గత ఆరు సంవత్సరాలుగా మండల పంచాయతీ అధికారిగా (ఎంపీవో) పనిచేసి, ఎనలేని సేవలను అందించిన షఫీ ఉల్లా ఖాన్ రంగారెడ్డి జిల్లా , అబ్దుల్లాపూర్ మెట్ కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో సహచర అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పంచాయతీ అధికారిణి డాక్టర్ జయసుధ మాట్లాడుతూ.. షఫీ ఉల్లా ఖాన్ ఆరు సంవత్సరాల సుదీర్ఘ కాలంలో మండల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కేవలం విధి నిర్వహణకే పరిమితం కాకుండా, మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలోనూ మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణ, ప్రభుత్వ పథకాల అమలులో ఆయన చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శమని ఆమె పేర్కొన్నారు.

## పత్తికుంటలో గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

**-పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,**



**అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త :**

గణేష్ నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేయాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అధికారులను ఆదేశించారు. గురువారం రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ పత్తికుంటలో గణేష్ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ నరేందర్ గౌడ్ ,బిజెపి రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ వైస్ శ్రీధర్‌లతో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పరిశీలించారు .రాబోయే గణేష్ నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. రాబోయే వినాయక చవితి కోసం పత్తి కుంట పూటిక తీసి శుభ్రం చేయడానికి దాదాపు రెండు కోట్ల రూపాయలు సాంక్షన్ చేయడం జరిగిందని చుట్టుప్రక్కల లైట్స్ ఫుట్ పాత్, షెడ్ వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయుటకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని కావున నిమజ్జన సమయం వరకు పనులు పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఈ ఈ మల్లేష్ ,ఇరిగేషన్ ఏఈ భాను , రెవెన్యూ అధికారి సాంబరాజు, స్థానిక కాంగ్రెస్ నాయకులు లలిత్ , బొక్క ప్రభాకర్ రెడ్డి నయీంమహేష్ ,శ్రవణ్ ,నవజ్యోతి యూత్ క్లబ్ అధ్యక్షులు ఎం శ్రీనివాస్ , శ్రీకాంత్ ముదిరాజు ,ఎన్ రవి తదితరులు పాల్గొన్నారు

## ప్రజల సమస్యల పట్ల వేగంగా స్పందించాలి

**-జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ**

**నార్సింగి, జూన్ 18 ప్రభాతవార్త :** ప్రజల సమస్యల పట్ల అన్ని శాఖల అధికారులు వేగంగా స్పందించాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ పేర్కొన్నారు. గురువారం నార్సింగి సర్కిల్ పరిధిలో డిసి లక్ష్మారెడ్డితో కలిసి జడ్‌సి విస్తృతంగా పర్యటించారు. సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను, వరద నీరు నిలువ ఉండే ప్రాంతాలు, పారిశుద్యం వంటి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం జడ్‌సి అమిత్ నారాయణ మాట్లాడుతూ వర్షాల కారణంగా వచ్చే వరదల వలన ప్రజలు ఇబ్బందులు పడకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వరద నీరు దిగువ ప్రాంతాలలోకి వెళ్లేంత వరకు సిబ్బంది రోడ్లపైనే ఉండాలని, మ్యాన్‌హోళ్లు తెరిస్తే అక్కడ తప్పకుండా ఒకరు ఉండి వాహనదారులు, ప్రజలను పక్క నుంచి పంపించాలని సూచించారు. వరదల తరువాత ఏర్పడే అపరిశుభ్రతను వెంటనే తొలగించాలని, సులువుగా వరద నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. వరదలు వచ్చినప్పుడు ట్రాఫిక్ సమస్య ఏర్పడితే ఆయా విభాగం అధికారులు వెంటనే క్లియర్ చేయాలని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనులు ఎంత వరకు వచ్చాయి? ఎప్పటి వరకు పూర్తవుతాయి? అని సంబంధిత అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఇ శివసాయి, ఏఈ సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లచ్చిరాం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : జోనల్ కమిషనర్

**అత్తాపూర్ జూన్ 18,ప్రభాతవార్త :**



సులేమాన్ నగర్, శాస్త్రిపురం డివిజన్ లలో వర్షం నీరు నిల్వ ఉండే ప్రాంతాలలో గురువారం శాసనమండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్ తో కలిసి రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యటించారు. వరద నీరు నిల్వ ఉండకుండ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. వర్షం ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పర్యటనలో ఎస్ ఈ నరేందర్ గౌడ్, అత్తాపూర్ డిప్యూటీ కమిషనర్ మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్ హబీబ్ జైన్ ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.

**యూసిడి బృందంతో సమీక్ష సమావేశం**

రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో యూసిడి బృందం (పిఓలు,సిఓలు)తో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు వేగవంతం చేయడం, బ్యాంక్ లింకేజీల పురోగతి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ మరియు అభివృద్ధి, అలాగే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం అమలుపై విస్తృతంగా చర్చించారు. కొత్త ఎస్‌హెచ్‌జి గ్రూపుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా, బ్యాంక్ లింకేజీలను మరింత మెరుగుపరచడం, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడం మరియు ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు .ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని జోనల్ కమిషనర్ గారు సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్లు , కమ్యూనిటీ ఆర్గనైజర్లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను మూసివేయరాదు

**పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలి**



సమావేశంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూసి వేయరాదని నినాదాలు చేస్తున్న వేదిక ప్రతినిధులు

**సైఫాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో లక్షలాది మంది నిరుపేద విద్యార్థులు ప్రాథమిక విద్యను అభ్యసించే పాఠశాలలను మూసివేసే ఆలోచనలను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని బాలల హక్కుల పరిరక్షణ వేదిక డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వేదిక రాష్ట్ర కన్వీనర్ జి.వేణుగోపాల్, కార్యదర్శి సి.హెచ్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలోని వేలాది పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలని, బోధనా సిబ్బంది కొరతను నివారించాలని, నాణ్యమైన విద్యను అందించాలని, అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు కోసం నాణ్యమైన విద్యను అందిస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీని ఇవ్వాలని, పట్టణ ప్రాంతాల్లో జనాభా ప్రాతిపదికన అన్ని డివిజన్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయాలని, విద్యా రంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులను కేటాయించాలని వారు కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు తెలంగాణ విద్య కమిషన్ చేసిన సిఫార్సులకు ప్రత్యేకంగా చట్టం తీసుకురావాలని, సిఫార్సులు అమలుకు తక్షణమే చర్యలు చేపట్టాలని, విద్యార్థుల హక్కుల పరిరక్షణకు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం సమగ్రమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వేదిక ప్రతినిధులు వెంకటేష్, బాలయ్య, రమాదేవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 22 నుండి శ్రీవేంకటేశ్వరస్వామి సప్తదశ బ్రహ్మోత్సవాలు

**నాంపల్లి, జూన్ 18 ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలోని గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో జేష్ఠమాసాన్ని పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం ఘనంగా నిర్వహించే శ్రీ వేంకటేశ్వరస్వామి వారి సప్తదశ వార్షిక అధ్యయన బ్రహోత్సవాలు కన్నుల పండువగా నిర్వహిస్తున్నట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఈమేరకు ఈ నెల 22 సోమవారం నుండి 27 శనివారం వరకు వైభవోపేతంగా జరిగే విశేష కైంకర్యములను ఆయన వివరించారు. అధిక సంఖ్యలో భక్తులు బ్రహ్మోత్సవాలలో శ్రీస్వామివారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని మనవి చేశారు.

## 'చలో సచివాలయం ముట్టడి ... జర్నలిస్టులు ఆరెస్టు

**సైఫాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష వైఖరికి నిరసనగా తమ డిమాండ్ల సాధన కోసం గురువారం 'చలో హైదరాబాద్' పేరిట గన్‌పార్కు నుంచి సచివాలయం ముట్టడికి ప్రయత్నించిన జర్నలిస్టులను పోలీసులు బలవంతంగా అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చిన జర్నలిస్టులు తొలుత గన్‌పార్కులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య తెలంగాణ అమర వీరుల స్థూపానికి నివాళులు అర్పించి మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 12 యేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పాలకులు పరిష్కారించకుండా వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్న చూపు చూడటం దుర్మార్గమన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకుడు బండి విజయ్‌కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, చిర్రా శ్రీనివాస్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**కెపిహెచ్‌బి కాలనీలో ఏటీఎం దొంగల అరెస్ట్...**

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త :**

ఏటీఎం కేంద్రాలకు వచ్చే కస్టమర్ల దృష్టి మరచి మోసపూరితంగా నగదును అపహరిస్తున్న ముఠాను కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వద్దే కాటమయ్య (25) పల్లపు శ్రీనివాస్‌లు గతంలో పలు దొంగతనాల కేసులో అరెస్టయి సంగారెడ్డి జైల్లో శిక్ష అనుభవిస్తున్నారు. అయితే సంగారెడ్డి జైల్లో శిక్ష అనుభవిస్తున్న సమయంలో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి జల్సాలకు అలవాటు పడ్డ వీరు జైలు నుండి బయటికి వచ్చాక పగడ్బందీగా ఏటీఎం సెంటర్ల వద్ద కస్టమర్లను మోసం చేయడానికి తెర లేపారు. ఇద్దరు పథకం వేసుకొని వద్దే కాటమయ్య ఏటీఎం సెంటర్‌కు బయట కాపలా కాయగా పల్లపు శ్రీనివాస్ ఏటీఎం నుండి క్యాష్ వచ్చే భాగంలో ప్లాస్టిక్ సీట్‌ను అమర్చేవాడు. కస్టమర్లు డబ్బును డ్రా చేసినప్పుడు ఖాతా నుండి కొంత మేరకే డబ్బు డ్రా అవ్వగా ప్లాస్టిక్ సీట్ కారణంగా కొంత డబ్బు బయటకు వచ్చేది కాదు. దీంతో ఏటీఎం లోపమని కస్టమర్లు వెళ్లిపోగానే ఇద్దరు నిందితులు ఏటీఎం సెంటర్లోకి ప్రవేశించి ప్లాస్టిక్ సీట్ తీయడంతో నగదు బయటికి వచ్చేది. దీంతో డబ్బులు తీసుకొని పరారయ్యేవారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7వ తేదీన కెపిహెచ్‌బి కాలనీ 9వ పేస్ వద్దగల యూనియన్ బ్యాంకు ఎటిఎం సెంటర్లో ఓ వ్యక్తి 5000 రూపాయలు డ్రా చేయగా డబ్బులు చేతికి రాలేదు. దీంతో బాధితుడు బ్యాంక్ అధికారులకు ఫిర్యాదు చేయగా సిసిటీవీ ఆధారంగా డబ్బు డ్రా చేస్తున్న వ్యక్తులను గుర్తించి వెంటనే కెపిహెచ్‌బి కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏటీఎంలో డబ్బులు డ్రా చేసేటప్పుడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి అనుమానం కలిగిన వెంటనే బ్యాంకు అధికారులకుగాని పోలీసులకుగాని ఫిర్యాదు చేయాలని వారు పేర్కొన్నారు.

## 25న గిరిజన ప్రజా ప్రతినిధుల 'ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర'

**-సెప్టెంబరు 18న ఎల్‌బి స్టేడియంలో 'ఎస్టీ రిజర్వేషన్ స్వర్ణోత్సవ వేడుకలు'**

**-అతిథిగా హాజరుకానున్న ప్రియాంకగాంధీ**

**సైఫాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** 1976లో ఇందిరాగాంధీ తెలంగాణ లంబాడీ, ఎరుకల, యానాది తెగలకు ఎస్టీ రిజర్వేషన్‌లు కల్పించి అర్ధశతాబ్దం పూర్తియిన సందర్భంగా ఈ నెల 25వ తేదీ నుంచి కాంగ్రెస్ గిరిజన ప్రజా ప్రతినిధుల 50 రోజుల 'ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర' ప్రారంభమవుతుందని ఆదివాసి కాంగ్రెస్ తెలంగాణప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ తెలిపింది. ఈ మేరకు గురువారం ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఇందుకు సంబంధించిన సన్నాహక కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు సభావత్ రాములు నాయక్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ లంబాడీ, ఎరుకల, యానాది తెగలకు రిజర్వేషన్‌లు కల్పించడం వల్లనే ఆనాటి నుంచి నేటి వరకు అనేక రంగాలలో అభివృద్ధి చెందాయని వివరించారు. ఈ యాత్రను విజయవంతం చేయాలని లంబాడీ, ఎరుకల, యానాది తెగలకు విజ్ఞప్తి చేశారు. యాత్ర తరువాత సెప్టెంబరు 18న చలో హైదరాబాద్ పేరిట ఎల్ బి స్టేడియంలో 'రిజర్వేషన్ స్వర్ణోత్సవ వేడుకలు' భారీ బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభకు ముఖ్యఅతిధిగా ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, ఎంపి ప్రియాంకగాంధీ ముఖ్యఅతిధిగా పాల్గొంటారని, అలాగే సిఎం రేవంత్‌రెడ్డితోపాటు ఎఐసిసి, టిపిసిసి నేతలు, రాష్ట్ర మంత్రులు తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన ఎస్టీ జాతికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి ఎస్.రవీంద్రనాయక్, శంకర్‌నాయక్, రవీందర్ నాయక్, రాజేష్‌నాయక్, వెంకట్ చౌహన్, వినయ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## విజయవాడ గడే సాయికృష్ణ అదృశ్యం, మరణంపై సిబిఐచే విచారణ జరిపించాలి

**సైఫాబాద్, జూన్ 18 ప్రభాతవార్త:** విజయవాడకు చెందిన గడే సాయికృష్ణ అదృశ్యం, అనుమానస్పద కస్టడి, మరణం కేసుపై తక్షణమే సిబిఐచే విచారణ జరిపించాలని ఆంధ్రప్రదేశ్ రిటైర్డ్ అదనపు పరిశ్రమల సంచాలకులు, మాదిగ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎ.వి.పటేల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ప్రధాన మంత్రి, కేంద్ర హోం శాఖ మంత్రి, ఎపి రాష్ట్ర సిఎం, సిబిఐ డైరెక్టర్, రాష్ట్ర గవర్నర్, జాతీయ మానవ హక్కుల కమిషన్, ఇతర అధికారులకు సమగ్రంగా వినతి పత్రాలను పంపడం జరిగిందని తెలిపారు. సాయికృష్ణ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఆందోళనలకు గురి చేసిందని, బాధితుని తల్లి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ ఫిటిషన్ నేపథ్యంలో ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందన్నారు. సాయికృష్ణను పోలీస్ కస్టడిలోకి తీసుకున్న తరువాత అదృశ్యమైనట్లు వచ్చిన ఆరోపణలపై స్వతంత్ర, నిష్పక్ష, పారదర్శక దర్యాప్తు అవసరమని కోర్టు పేర్కొందని ఆయన తెలిపారు. ఈ కేసును వెంటనే సిబిఐకి బదిలీ చేయాలని, సిసిటివి ఫుటేజీ, కాల్ డేటా రికార్డులు, స్టేషన్ డైరీలు, కస్టడీ రికార్డులు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని, ఈ కేసుకు సంబంధించి సిఐ, డిఎస్పీ, డిసిపి, విజయవాడ పోలీస్ కమీషనర్‌తో సహా సంబంధిత అధికారులను విచారణ పూర్తి అయ్యేంతవరకు నాన్-సెన్సిటివ్ పోస్టులకు బదిలీ చేయాలని, బాధిత కుటుంబ సభ్యులు, సాక్షులకు రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయం జరగడమే కాకుండా న్యాయం జరిగినట్లు ప్రజలకు కన్పించాల్సిన అవసరం ఉందని, ప్రజల విశ్వాసాన్ని పునరుద్దరించాలంటే స్వతంత్ర సిబిఐచే దర్యాప్తు చేయించడం సరైన మార్గమన్నారు. ఈ కేసులో నిజా నిజాలు వెలుగులోకి వచ్చి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకునేంతవరకు పోరాటం కొనసాగిస్తామని ఎ.వి.పటేల్ స్పష్టం చేశారు.

## బాగ్అంబర్‌పేటలో శంకుస్థాపనలు చేపట్టిన వీహెచ్

**హైదరాబాద్, జూన్ 18 ప్రభాతవార్త**



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ సలహాదారు విహెచ్

బాగ్అంబర్‌పేటలో పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు శంకుస్థాపనలు చేశారు. గత కొద్ది కాలంగా స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా గురువారం రిటర్నింగ్ వాల్ నిర్మాణానికి గురువారం వి.హెచ్ శంకుస్థాపన చేశారు. డివిజన్ పరిధిలోని శాంతినగర్, బతుకమ్మ కుంట ఓపెన్ నాలా రిటర్నింగ్ వాల్ పనులకు 1.31కోట్ల వ్యయంతో చేపట్టిన నిర్మాణ పనులకు విహెచ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్,డిఈ ప్రవీణ్, ఏఈ రామ్‌రెడ్డి, సూపర్వైజర్ రవీందర్, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, పీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ పి.నారాయణస్వామి, కోటం అనిల్, రావుల సుధాకర్, కోట్ల కిరణ్ , సిపిఎం మహేందర్, జంగయ్య,అందే శ్రీశైలం కురుమ, డాక్టర్ ఎం ఎన్ చారి, సుబ్బారావు ,బాలకృష్ణ, పురమల్ బాటి, రామ్ గోపాల్ కచ్వా, ఉమ్నిచంద్ బాటి, రామ్ కిషోర్ కచ్వా , పోకర్ జి, పవర్ లాల, సజ్జన్ బాటి, రామ్ స్వరూప్ కచ్వామహావీర్ జైన్, పాల్గొన్నారు.

**బాగ్అంబర్‌పేట్ వెల్ఫేర్ సొసైటీకి 900 గజాల స్థలం...**

బాగ్అంబర్‌పేట్ వెల్ఫేర్ సొసైటీ కాలనీ ప్రజలకు ఒక శుభవార్త. కాలనీలోని 900 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని జిహెచ్ఎంసి అధికారికంగా వెల్ఫేర్ సొసైటీకి కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు చేసిన నిరంతర కృషి, ప్రత్యేక ప్రయత్నాల వల్లే ఈ స్థల కేటాయింపు సాధ్యమైంది. ఈ సందర్భంగా కాలనీ కార్యవర్గ సభ్యులు, స్థానిక ప్రజలు హనుమంత్‌రావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కాలనీ సంక్షేమ కార్యక్రమాలకు ఈ స్థలం ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో స్థల పరిశీలన కార్యక్రమంలో పీసీసీ సెక్రెటరీ శంభుల శ్రీకాంత్ గౌడ్,కంటెస్టెడ్ కార్పొరేటర్ శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్, పి.నారాయణస్వామి, వి.లక్ష్మీపతి, పంజాల గిరిధర్‌గౌడ్, నక్కా ప్రదీప్‌గౌడ్, వి.హేమంత్‌కుమార్, అరుణ, పాక దేవేందర్, విజయారెడ్డి, సయ్యాద్ ఇబ్రాహీం పాల్గొన్నారు.

## చిన్నారి శాస్త్ర మహీ ప్రతిభకు చేయూత



నగదును అందజేస్తున్న ఇందుమతి శ్రీరంగం

**కెపిహెచ్‌బి కాలనీ, జూన్ 18, ప్రభాతవార్త**

వ్యక్తిగత విజయంతో పాటు దేశాభివృద్ధికి తోడ్పడే పౌరులుగా పిల్లలు ఎదగాలనీ శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం పేర్కొన్నారు. నేటి సమాజంలో పాశ్చాత్య దేశాల సంప్రదాయాల వైపు చూస్తున్న వేళ, చిన్నారులకు ఆధ్యాత్మికత వైపు అడుగులు వేసేలా ప్రయత్నం చేస్తున్న జంగాల రాజేష్ నవ్య దంపతుల కుమార్తె శాస్త్ర మహీ చిన్న వయసు నుండే భక్తి మార్గంలోకి వెళుతున్న చిన్నారికి అందరూ అభినందనలు తెలుపుతున్నారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు ఇటీవల ఆన్‌లైన్‌లో హనుమాన్ చాలీసా పోటీ పెట్టగా హనుమంతుడిపై అపార భక్తిని చాటుతూ కేవలం నాలుగు నిమిషాలలోనే చాలీసాను ఎలాంటి తడబాటు లేకుండా పూర్తి హనుమాన్ చాలీసాను అనర్గళంగా పారాయణం చేసి ప్రశంసలు అందుకుంది. వివిధ రంగాలలో చదువులో, ఆటల్లో, నాట్యంలో ప్రావిణ్యం పొందిన చిన్నారి శాస్త్ర మహీ ప్రతిభకు శ్రీరంగం ఫౌండేషన్ ద్వారా ప్రోత్సాహకార చేయూత నగదు రూపంలో మాదాపూర్‌లోని కార్యాలయంలో శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఇందుమతి శ్రీరంగం మాట్లాడుతూ చదువుతో పాటు పిల్లలలోని సహజ ప్రతిభను వెలికితీయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రతిభను ప్రదర్శించే అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌కు బిఎల్‌ఓలు సహకరించాలి : డిసి లక్ష్మారెడ్డి



నార్సింగి సర్కిల్ కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై జరిగిన సమావేశంలో పాల్గొన్న ఆల్‌పార్టీస్ నాయకులు, అధికారుల దృశ్యం

**నార్సింగి, జూన్ 18 ప్రభాతవార్త :**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు నార్సింగి సర్కిల్ పరిధిలోని అన్ని పార్టీల రాజకీయ నాయకులు, బిఎల్‌ఓలు పూర్తి సహకారం అందించాలని డిసి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. గురువారం నార్సింగి సర్కిల్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులకు ఎస్ఐఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిసి మాట్లాడుతూ ఈ నెల 25.వ,తేదీ నుంచి ఆగస్టు 24.వ,తేదీ వరకు నార్సింగి సర్కిల్ పరిధిలో ఎస్ఐఆర్ కార్యక్రమం కొనసాగుతుందని వివరించారు. రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లకు ఎస్ఐఆర్‌పై సరైన అవగాహన కల్పించాలని, ఎన్నికల నియమావళిని అనుసరించి నిర్ణీత తేదీలలో బిఎల్‌ఓలకు క్షేత్ర స్థాయిలో సహకరించాలని కోరారు. ఎస్ఐఆర్ వలన దేశంలోని ఒక పౌరుడికి ఒకే ఓటు ఉంటుందని, పలు ప్రాంతాలలో ఉన్న ఓట్లన్నింటిని తొలగించడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియ వలన ఒరిజినల్ ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని, రెండు మూడు ప్రాంతాలలో ఓట్లుంటే అన్నీ తీసివేసి ఒక ఓటును ఖరారు చేస్తారని వివరించారు. ఈ ఎస్ఐఆర్‌పై ఎవరికి ఎలాంటి అనుమానాలున్నా వెంటనే బిఎల్‌ఓలను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ నెల 20.వ,తేదీన భూత్‌స్థాయి అధికారులు, ఏజెంట్లకు ఎస్ఐఆర్‌పై శిక్షణా కార్యక్రమం ఉంటుందని డిసి లక్ష్మారెడ్డి వివరించారు.

## నూతన పోస్ట్ ఆఫీస్ భవనం ప్రారంభం

**ధారూర్, జూన్ 18, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోస్ట్ ఆఫీస్ భవనాన్ని తాండూర్ డివిజన్ పోస్ట్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోస్ట్ శాఖ నుంచి రూ. 30 లక్షల నిధులతో అత్యాధునిక వసతులతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. మండల ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ఈ నూతన భవనం ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. అలాగే, పోస్ట్ ఆఫీస్ కార్యాలయం ఇకపై పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉంటుందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోస్ట్ మాస్టర్ పురుషోత్తం రెడ్డి, స్థానిక సర్పంచ్ ప్రమీల గౌడ్, డీసీసీ కార్యదర్శి బాబా ఖాన్, బుజ్జయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొల్తూర్‌లో ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభం

**శామీర్‌పేట, జూన్ 18, ప్రభాతవార్త :** కొల్తూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ: పూర్తి కావటంతో మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్ ప్రారంభించి లబ్దిదారులతో గృహప్రవేశం చేయించారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపల్ పరిధిలోని కొల్తూర్ గ్రామంలో లబ్దిదారులు కుండ భాగ్య-రాజులకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. దీంతో వారు సకాలంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకున్నందుకు ఆయనతో పాటు పలువురు నాయకులు లబ్దిదారులను అభినందించి సన్మానించారు. మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలుయాదవ్‌తో పాటు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశతో కలిసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తుందని ఒక్కొక్క ఇంటి నిర్మాణ:కు 5లక్షల రూపాయలు అందజేస్తుందన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల వరంగా మారిందని చైర్మన్ నర్సింలుయాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మూడుచింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశ, మాజీ వైస్ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ నాయకులు బండి జగన్నాథం, మాజీ ఎంపిటిసిలు అనతరెడ్డి, వెంకటేశ, మాజీ సర్పంచు శిల్పా యాదగిరి, నాయకులు శ్రీకాంత్‌గౌడ్, గురువయ్య, బాలకృష్ణ, తిరుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, అంజనేయులు, నర్సింలు, శేఖర్‌రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాండరి, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ

**శామీర్‌పేట, జూన్ 18, ప్రభాతవార్త :** దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలేశ్‌లు దాత నాగిరెడ్డి వెంకట్‌రెడ్డి అందజేసిన నోట్‌బుక్స్‌ను పంపిణీ చేశారు. గురువారం శామీర్‌పేట మండలంలోని దేవరయాంజాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవతరగతి విద్యార్థులకు దాత నాగిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉచితంగా వారికి అవసరమైన నోట్‌బుక్స్‌ను అందజేయటంతో వారు పంపిణీ చేశారు. దాత నాగిరెడ్డి వెంకట్‌రెడ్డి నోట్‌బుక్స్‌ను ఉచితంగ అందజేయటంతో ఆ విద్యార్థులు సంతోషం వ్యక్తం చేసి దాతకు దన్యవాదాలు తెలియజేశారు. దాత నాగిరెడ్డి వెంకట్‌రెడ్డి సేవలను జిల్లా ఆర్టీఏ మెంబర్ బి..జైపాల్‌రెడ్డి, ప్రదానోపాధ్యాయులు బాలేశ్‌లు అభినందనలు తెలిపి ప్రశంసించారు. గత 15సంవత్సరాలుగ విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్‌ను ప్రతి ఏటా అందజేస్తున్నారని, విద్యాభివృద్ధికి సహకరిస్తున్న ఆయనకు వారు ప్రత్యేకంగా దన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను ఉచితంగా అందజేయటం ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు ఆమోఘమని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి దాతలు ప్రోత్సహిస్తున్న వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మన ఊరి బడిని కాపాడుకుందాం


ప్రచారం చేస్తున్న సర్పంచ్ రమేష్ యాదవ్

**కేశంపేట, జూన్ 18, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల లో చేర్పించాలని ఇంటి ఇంటికి వెళ్లి సర్పంచ్ రమేష్ యాదవ్ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రమేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అనుభవతులైన ఉపాధ్యాయులు ఉంటారన్నారు. వాటితో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ ముగ్గులు యూనిఫామ్, మధ్యాహ్నం భోజనం వంటి వసతులు ఉంటాయని తెలిపారు. 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు గ్రామ బడిలో చేర్పించి గ్రామ బడిని కాపాడుకుందాం అని గ్రామ సర్పంచ్ పోచమోని రమేష్ యాదవ్ గ్రామ తెలియచేసారు. అదేవిదంగా నూతనంగా ఇద్దరు విద్యార్థులు అడ్మిషన్ తీసుకోవడం జరిగిందన్నారు, వారికి హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు, మరిన్ని అడ్మిషన్ లు వచ్చే విదంగా అందరూ సమిష్టిగా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుచరిత, షాహీన్, పంచాయతీ కార్యదర్శి మురళి విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుత నిరసనను అడ్డుకోవడం తగదు

**కొత్తూరు, జూన్ 18, ప్రభాతవార్త:** ముందస్తు అరెస్టులతో ప్రజాస్వామ్య గొంతుకను అణిచివేయొద్దు అన్ని బీఆర్ఎస్ నాయకులు శివ చారి, రాఘవేందర్ యాదవ్ పేర్కొన్నారు. గురువారం కొత్తూరు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసిన సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరుద్యోగ యువత సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన శాంతియుత నిరసన కార్యక్రమాలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బీఆర్ఎస్ యువ నాయకులు శివాచారి, మేకల రాఘవేందర్ యాదవ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 20 వేలకుపైగా కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి ముందు పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తీసుకురావడంతో వారు తీవ్రంగా ఖండించారు. ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు భారీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రాష్ట్రంలో వేలాది పోలీస్ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ కేవలం 5 వేల పోస్టులతో నోటిఫికేషన్ ఇవ్వాలని ప్రయత్నించడం నిరుద్యోగ యువత ఆశలను దెబ్బతీస్తోందన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే 20 వేల కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. యువత హక్కుల కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## ఘనంగా ఆశ్రమ పాఠశాల ప్రారంభోత్సవం

**తలకొండపల్లి జూన్ 18, ప్రభాతవార్త :** మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ సమాజానికి అందిస్తున్న పలు సేవా కార్యక్రమాలు అభినందనీయమని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. గురువారం తలకొండపల్లి మండలంలోని ఎక్స్ రోడ్లో నూతనంగా ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో ఉప్పల ఆశ్రమ రెసిడెన్షియల్ పాఠశాలను ప్రారంభించారు. లక్షల రూపాయల ఖర్చుతో పేద పేద బాలికలకు ఆశ్రమ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మించి చదువు చాలా అభినందనీయమని కొనియాడారు. బాలికల విద్యాభివృద్ధికి ఇటువంటి విద్యాసంస్థలు ఎంతో దోహదపడతాయని విద్య సామాజిక రంగాల్లో సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. ఉప్పల వెంకటేష్ సేవా కార్యక్రమాలను ముఖ్యంగా బాలికల విద్యా భివృద్ధి కోసం ఆశ్రమ పాఠశాల ఏర్పాటు అభినందనీయమని, ఎంతో ఖర్చుతో కూడుకున్న పనిని ప్రజల కోసం నిర్వహించడం చెప్పుకోదగ్గ విషయమని వారు కొనియాడారు. తల్లిదండ్రులు లేని నిరుపేద బాలికలకు స్వచ్ఛందంగా పాఠశాలతో పాటు డెన్సియల్ ఏర్పాటు చేయడం సమాజాన్ని మేల్కొల్పడమని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ టిఆర్ఎస్ ఇన్చార్జి రజిని, మాజీ ఎంపీపీలు తిరుమణి నిర్మల శ్రీశైలం గౌడ్ శ్రీనివాస్ యాదవ్, రాములు, మాజీ ప్రజా ప్రతినిధులు గోపాల్ నాయక్ లలిత జోతయ్య, శేఖర్ యాదవ్, సుధాకర్, మల్లేష్, వెంకటయ్య, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభిస్తున్న మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**తలకొండపల్లి, జూన్ 18, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నాడు మృతి చెందిన జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాదులోని నాంపల్లి లో గల తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా తల కొండపల్లి మండల జర్నలిస్టు తక్కలపల్లి రాజేందర్ కుటుంబానికి లక్ష రూపాయల చెక్కును శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు . తలకొండపల్లి మండలంలో మెట్రో ఈవినింగ్ లో రిపోర్టర్గా పనిచేస్తున్న తక్కళ్లపల్లి రాజేందర్ ఈ సంవత్సరం జనవరిలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందారు. జర్నలిస్టు కుటుంబానికి అండజేస్తున్న సంక్షేమ పథకంలో భాగంగా అతని భార్య తక్కళ్లపల్లి రమాదేవికి ఒక లక్ష రూపాయల చెక్కును అందజేశారు. వారి ఇద్దరి కుమారులకు ఈ నెల నుంచి చదువు కోసం ఒక వెయ్యి రూపాయలు చొప్పున, తను భార్యకు మూడు వేల రూపాయల పెన్షన్ను అందజేయనున్నట్లు శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. భవిష్యత్తులో జర్నలిస్టులకున్న సమస్యలను తీర్చేందుకు అకాడమీ కృషి చేస్తుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, మీడియా నాయకులు అశోక్, తక్కళ్లపల్లి రమాదేవి, కుమారుడు జస్వంత్ తలకొండపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దరువుల శంకర్ , తలకొండపల్లి మండల కాంగ్రెస్ నాయకులు దేవిడ్ తదితరులు ఉన్నారు.


ఖానాపూర్లో పాఠశాల నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనుల నాణ్యతలో రాజీ వద్దు

**తలకొండపల్లి, జూన్ 18, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పనులను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తలకొండపల్లి మండలం ఖానాపూర్లో పరిశీలించారు. భవిష్యత్ తరాలకు ప్రపంచ స్థాయి విద్యను అందించాలని రాష్ట్ర ప్రభుత్వ మహత్తర సంకల్పానికి ప్రతీకగా రూపుదిద్దుకుంటున్న ఈ విద్యా ప్రాంగణ నిర్మాణ పురోగతిని ఆయన స్వయంగా సందర్శించి సమీక్షించారు. ఈ ప్రాజెక్టు కేవలం ఒక పాఠశాల నిర్మాణం మాత్రమే కాదని, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తర విద్యా యజ్ఞమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేసిన ఎమ్మెల్యే గారు, ప్రతి నిర్మాణం దీర్ఘకాలికంగా నిలిచేలా అత్యుత్తమ ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్ణయించిన గడువుకంటే ముందుగానే పనులు పూర్తి చేసే దిశగా కృషి చేయాలని, ఎక్కడైనా జాప్యం లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే పరిష్కరించి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.

## నిర్లక్ష్యంగా ట్రాక్టర్ నడిపిన డ్రైవర్పై చర్యలు తీసుకోవాలి

**పెద్దేముల్, జూన్ 18, ప్రభాతవార్త:** బైకును టిప్పర్ ఢీ కొన్న సంఘటన పెద్దేముల్ పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల తిమ్మమ్మోల్ల సునిత, భర్త వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం రేగొండి గ్రామానికి చెందిన తిమ్మమ్మోల్ల సునిత, వెంకటయ్య కలిసి బైక్పై తాండూరుకు వెళ్తుండగా, టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి వారి బైకును ఢీ కొట్టాడని తెలిపారు. దీంతో తిమ్మమ్మోల్ల సునిత చేతులకు, మోకాలుకు, మెడకు తీవ్రగాయాలయ్యాయని బాధితులు తెలిపారు. నిర్లక్ష్యంగా టిప్పర్ నడిపి ప్రమాదానికి కారకుడైన డ్రైవర్పై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ కంకర లోడుతో గల టిప్పర్లు మితిమీరిన వేగంతో పోవడం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక లోడుతో వెళ్తుండటంతో కంకర తాడు పత్తి (టార్పాల్) వేయక పోవడంతో రోడ్డుపై కంకర పడి బైకులు స్కిడ్ కావడంతో ప్రమా దాలు చోటుచేసుకుం టున్నాయని అన్నారు. అధిక లోడు, ఓవర్ స్పీడ్తో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకో వాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# యువత ఛత్రపతి అడుగుజాడల్లో నడవాలి

**యాలాల, జూన్ 18, ప్రభాతవార్త :** గత రెండు మూడు దశాబ్దాల కాలంపాటు యాలాల మండల కేంద్రం ప్రజలు గుత్తాదిపతుల చేతుల్లో నలిగిపోయారని స్థానిక ఎన్నికల్లో ప్రజలు వారికి సరైన గుణపాఠం చెప్పారని తాండూరు శాసన సభ్యులు బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రతిపక్ష నేతలను ఉద్దేశించి పరోక్ష అస్త్రాలు సంధించారు. గురువారం యాలాల మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమి పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే మాట్లాడుతూ శివాజీ మహారాజ్ స్ఫూర్తితో యువత కలిసికట్టుగా మండల కేంద్రంలో ఆ నేతల ఉనికి లేకుండా చేయాలని పిలుపునిచ్చారు. మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆయన భరోసా ఇచ్చారు. స్థానిక నాయకులు అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని అందుకు తాను అన్ని విదాల సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. గత ఎన్నికల్లో ప్రతిపక్షాల నేతల ఆగడాలకు చెక్ పెట్టినట్లే మున్ముందు కూడా వారి ఆటలు సాగకుండా యువత శివాజీ స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన సూచించారు. శివాజీ మహారాజ్ అడుగు జాడల్లో యువత ముందుకు సాగుతూ అక్రమార్కులను ఎదిరించాలన్నారు. ఏది ఏమైనా యాలాలలో శివాజీ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతిపక్ష నాయకులపై పరోక్షంగా ఫైర్ అవ్వడం విశేషం. మండల కేంద్రంలో ఛత్రపతి విగ్రహ ఏర్పాటునకు ముందుకు వచ్చిన స్థానికులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు సిహెచ్. శివయ్య, ఎమ్మార్వో గాయత్రి, ఎంపిడిఒ


యాలాలలో ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

శ్రీనిజ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సిములు, మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, కోల్కుంద హన్మంతు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పేరి రాజేందర్‌రెడ్డి, అక్బర్‌బాబా, అనీల్‌కుమార్ చెన్నారం, మంగళి మల్లయ్య, విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు మ్యాదరి వినోద్, బాలు. సందీప్, నవీన్, వినయ్, నర్సిములు ,శేఖర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు

**యాలాల జూన్ 18, ప్రభాతవార్త :** కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ పథకం పేదలకు వరం లాంటిదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ఫలాలు అర్హులకు అందరికీ అందినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతోందని, అర్హులైన అందరికీ పథకాలు అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గురువారం యాలాల మండల పరిషత్ కార్యలయ మీటింగ్ హాల్‌లో కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చలబ్దిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 46 మంది లబ్దిదారులకు సంబంధించిన రూ. 46.5336 లక్షల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగ ఎమ్మెల్యే బుయ్యని మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందాలని ఆయన ఆకాంక్షించారు, ఆ దిశగా కాంగ్రెస్ సర్కార్ ముందుకు పోతోందన్నారు. చెక్కుల విషయంలో దళారులకు ఒక్క పైసా ఇవ్వరాదన్నారు. మధ్యవర్తులు డబ్బులు అడిగితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. గ్రామ పంచాతీలకు మంజూరైన భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని సర్పంచులకు సూచించారు. ఓటరు నమోదు ప్రక్రియలో సర్పంచులు బిఎల్ఓలు పాలుపంచుకొని అందరికీ న్యాయం జరిగేలా చూడలన్నారు. సర్ కార్యక్రమంతో ఓటర్లు


చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

ఎవరికీ అన్యాయం జరగకుండా చూడాలని ఎమ్మెల్యే సూచించారు. కాంగ్రెస్ సర్కారు హాయంలోనే తాగు, సాగు నీటి పథకాలు వచ్చాయని, యాలాల శివసాగర్ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు తాను కృషి చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ప్రాజెక్టుల నిర్వాహణ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే జరుగుతున్నాయని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రాజెక్టుల పరిధిలోని ప్రతి ఎకరా ఆయకట్టుకు సాగునీరందేలా చూస్తున్నట్లు ఆయన వివరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వుళుతున్నట్లు మనోహర్‌రెడ్డి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ శ్రీనిజ, ఎమ్మార్వో గాయత్రి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహిపాల్‌యాదవ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామస్థాయిలో కమ్యూనిటీ పోలీసింగ్ మరింత పటిష్టం

**కేశంపేట, జూన్ 18, ప్రభాతవార్త :** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జ్యోషి గురువారం కేశంపేట పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయన, ముందుగా వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం రికార్డుల నిర్వహణ, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, శాంతిభద్రతల పరిస్థితి మరియు ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో కమిషనర్ సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. ప్రధానంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి. ఫిర్యాదులను స్వీకరించిన వెంటనే స్పందించాలి అని స్పష్టం చేశారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న కేసులను గడువులోగా పూర్తి చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళా రక్షణపై ప్రత్యేక దృష్టి మారుతున్న కాలంతో పాటు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కమిషనర్ పేర్కొన్నారు.


సిపి తరుణ్ జోషికి స్వాగతం పలుకుతున్న సిబ్బంది

మహిళలు, పిల్లల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, గ్రామస్థాయిలో కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, ప్రజలకు పారదర్శకమైన మరియు సమర్థవంతమైన సేవలను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో సంబంధిత డీసీపీ, ఏసీపీ, స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడద్దు

### యువతకు ఎమ్మెల్సీ నవీన్ కుమార్‌రెడ్డి పిలుపు

**కేశంపేట, జూన్ 18, ప్రభాతవార్త:** నేటి యువత ప్రభుత్వ ఉద్యోగాలకు ఎదురు చూడకుండా స్వయం ఉపాధి మార్గాలని ఎంచుకొని తమ కుటుంబాలను పోషించుకుంటూ ఉన్నత స్థాయికి ఎదగాలని ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం కేశంపేట మండల కేంద్రంలో కిట్టు యాదవ్ ఏర్పాటు చేసిన అగ్రి డ్రోన్స్ సేల్స్ మరియు సర్వీస్ షాప్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్‌ను ప్రారంభించిన అనంతరం యాజమాని కిట్టు యాదవ్‌ను అభినందిస్తూ, వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను రైతులకు చేరువ చేయడానికి చేస్తున్న కృషిని ప్రశంసిస్తూ వ్యవసాయంలో అగ్రి డ్రోన్ల వినియోగం రైతులకు ఎంతో ప్రయోజనకరమని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పేర్కొన్నారు. డ్రోన్ల ద్వారా పంటలపై ఎరువులు, పురుగు మందులను తక్కువ సమయంలో సమర్థవంతంగా పిచికారీ చేయవచ్చని, దీంతో సమయం, శ్రమ మరియు ఖర్చు తగ్గుతాయని అన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెరిగి మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. రైతులకు ఉపయోగపడే ఇలాంటి సేవలను అందుబాటులోకి తీసుకు రావడం అభినందనీయమని


అగ్రి డ్రోన్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తదితరులు

అన్నారు. ఈ కార్యక్రమంలో పోమాల్ పల్లి సర్పంచ్ బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి, తూర్పుగడ్డ సర్పంచ్ థౌర్యా నాయక్, మాదేవ్ పూర్ సర్పంచ్ రవీందర్ రెడ్డి, భైరఖాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్, మాజీ సర్పంచులు తలసాని వెంకట్ రెడ్డి, తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి, తోట ఆంజనేయులు యాదవ్, బాల్ రాజ్ గౌడ్, కృష్ణయ్య, హరి నాయక్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, సుందరపూర్ డిప్యూటీ సర్పంచ్ యారం రాంరెడ్డి, మాజీ ఉపసర్పంచులు సుదర్శన్ సెట్, రాంరెడ్డి, మండల బిఆర్ఎస్ నాయకులు నరేందర్ జి, అబ్బీ శ్రీనివాస్, మని గౌడ్, నిర్దవెల్లి నాగరాజు, పల్లటి కృష్ణయ్య, కేశంపేట మురళి, తలసాని ప్రవీణ్ రెడ్డి, సత్యనారాయణ, బద్రు నాయక్, దినేష్ సాగర్, అన్వారీ రాజు, షాప్ యజమాని కిట్టు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్ల భారం కాదు.. కుటుంబానికి వెలుగునిచ్చే దీపం

**పెద్దేముల్, జూన్ 18, ప్రభాతవార్త:** ఆడపిల్ల భారం కాదని, కుటుంబానికి వెలుగునిచ్చె దీపమని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం తాండూరు యంపిడిఓ కార్యాలయ ఆవరణలో 164 మంది లబ్దిదారులకు రూ.16 లక్షల కల్యాణలక్ష్మి, శాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోందని, లబ్దిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రజాప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని. ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని గుర్తుచేశారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తున్నామని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయేజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జూన్ 25 నుంచి సమగ్ర


కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఓటరు సవరణ ప్రక్రియ ప్రారంభం కానుందని, అర్హులైన ఓటర్లందరు పాల్గొని సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి, ఏఎంసి చైర్మెన్ పట్లోల్ల నర్సిములు, వైస్‌చైర్మెన్ అబ్దుల్ రజాక్, మునిసిపల్ కౌన్సిలర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, యంపిడిఓ, రెవిన్యు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కరీంగూడ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం

**కీసర, జూన్18, ప్రభాతవార్త :** విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని మాజీ ఎంఈఓ జమదగ్ని అన్నారు. కరీంగూడ పాఠశాలలో గురువారం 1వ తరగతి విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం, నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిష్ణాతులైన టీచర్లతో ఇంగ్లీష్ మాధ్యమంలో విద్యాబోధన, ఉచిత యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, మధ్యాహ్న భోజనం, క్రీడలు, డిజిటల్ అక్షరాస్యత, నాణ్యమైన చదువు అందుతుందని వివరించారు. తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు వెళ్లకుండా ఉచితంగా నాణ్యమైన విద్య అందిస్తున్న సర్కారు బడులకు తమ పిల్లలను పంపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, మాజీ ఉపసర్పంచ్ మాధవరెడ్డి, కాంగ్రెస్ నాయకులు హరిప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఇందిరమ్మ లబ్ధిదారులకు శుభాకాంక్షాలు చెబుతున్న మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.పావని

## లబ్ధిదారులు కాంగ్రెస్‌కు అండగా ఉండాలి

**ఘట్‌కేసర్, జూన్ 18, ప్రభాతవార్త:** నిరుపేదల సొంతింటి కలను నిజం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఘట్‌కేసర్ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం. పావని అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి గురువారం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇంటి పథకాన్ని సద్వినియోగం చేసుకున్నందుకు శుభాకాంక్షాలు తెలిపారు. నాడు నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే పేదలకు ఇండ్లు కేటాయించి నిర్మించి ఇచ్చిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఒక్కొక్కటి నేరవేర్చుతుందని అన్నారు. లబ్ధిదారులు కాంగ్రెస్ పార్టీకి, ప్రభుత్వానికి అండగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధా కృష్ణ ముదిరాజ్, నాయకులు ఎం. జంగయ్యయాదవ్, బర్ల దేవేందర్ ముదిరాజ్, యు. ఆంజనేయులు, ఖయ్యూం, రవి పాల్గొన్నారు.



## బోధనా నైపుణ్యానికి ఐదురోజుల శిక్షణ

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:** అనురాగ్ యూనివర్శిటీలో ఆంగ్ల విభాగ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణా తరగతులు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తమిళనాడు సెంట్రల్ యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కేవీ. రఘుపతి పాల్గొని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంటిగ్రేటెడ్ ఇంగ్లీష్ క్లాస్‌రూమ్ రీసెర్చ్ విభాగాల్లో తీసీస్ రైటింగ్‌పై ఉపయుక్తమైనటువంటి సలహాలు సూచనలు చేశారు. అధ్యాపకులకు ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంగ్ల విభాగాధిపతి జీవీఎస్ అనంతలక్ష్మీ, యూనివర్శిటీ డైరెక్టర్ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ మహీపతి శ్రీనివాసరావు, అధ్యాపక బృందం, యూనివర్శిటీ రీసెర్చ్ స్కాలర్స్ తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యదర్శిని సన్మానిస్తున్న గ్రామస్థులు

## కార్యదర్శి ఆనంద్ సేవలు అభినందనీయం

**పెద్దేముల్, జూన్ 18, ప్రభాతవార్త:** గ్రామ అభివృద్ధికి పంచాయతీ కార్యదర్శి ఆనంద్ చేసిన సేవలు వెలకట్టలేనివని రుద్రారం సర్పంచ్ ఉప్పరి పద్మమ్మ అన్నారు. గురువారం పెద్దేముల్ మండలం రుద్రారం గ్రామపంచాయతీ ఆవరణలో బదిలి అయిన పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌ను సర్పంచ్ ఉప్పరి పద్మమ్మ, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు పి. మహిపాల్‌రెడ్డి, తట్టెపల్లి సోసైటి డైరెక్టర్ ఉప్పరి మల్లేశం, సీనియర్ నాయకులు ఉప్పరి వీరేశం, రాజు స్వామి తదితరులు ఘనంగా సన్మానించారు. బదిలిపై వెళుతున్న పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కు వీడ్కోలు పలుకుతు, నూతనంగా పదవి భాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శి అర్చనకు స్వాగతం పలికారు. నూతనంగా వచ్చిన కార్యదర్శి అర్చన గ్రామానికి మంచి సేవలు అందించి, ఆనంద్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ కుమార్, వార్డు మెంబర్లు లక్ష్మమ్మ, చిట్టెమ్మ, గొల్ల మల్లప్ప, ద్యావరి వీరన్న, గ్రామస్థులు వెంకటయ్య, ఉప్పరి రవి, రుద్రారం, నర్సాపూర్ అంగన్‌వాడి టీచర్లు బాలమణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం విక్రేతల అరెస్టు

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 18, ప్రభాతవార్త:** కాప్రా ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్‌లో రెండు వేర్వేరు ఇండ్లలో అక్రమంగా విదేశీ మద్యంతో పాటు గోవా మద్యం దాదాపు 257 లీటర్లు నిల్వఉంచి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ పోలీసులు గురువారం తెలిపారు. సంఘటన వివరాలు ఎక్సైజ్ సీఐ జూపల్లి రవి తెలిపిన వివరాల ప్రకారం జవహర్ నగర్‌లోని వెంకటేశ్వర నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రెడ్డిశెట్టి మహేశ్ (50) తన ఇంటిలో అక్రమంగా విదేశీ మద్యంతో పాటు గోవా మద్యాన్ని దాదాపు 59 మద్యం బాటిల్స్ నిల్వ ఉంచినట్లు తెలిపారు. వీటి పరిమాణం దాదాపు 51.55 లీటర్లు ఉంటుందని తెలిపారు. విశ్వసనీయ సమాచారంతో సదరు నిందితుడి ఇంటిపై ఎక్సైజ్ పోలీసులు దాడి జరిపి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితుడు రెడ్డిశెట్టి మహేశ్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మరో సంఘటనలో జవహర్‌నగర్ పరిధిలోని మోహన్‌రావు కాలనీలో నివాసం ఉండే రెడ్డిశెట్టి శ్రీనివాస్ ( 52 ) తన ఇంటిలో విదేశీ, గోవాకు చెందిన మద్యం సీసాలు 112 లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వీటి పరిమాణం దాదాపు 75.75 లీటర్లు ఉంటుందని తెలిపారు. వీటితో పాటు అనుమతించబడిన మద్యం సీసాలు వివిధ బ్రాండ్లకు చెందినవి 251 వరకు ఉన్నాయని వీటి పరిమాణం 129.66 లీటర్లు ఉంటుందని తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వఉంచి అధిక ధరలకు విక్రయిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్న నిందితుడు శ్రీనివాస్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. రెండు కేసుల్లో పట్టుబడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి పట్టుబడిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు కాప్రా ఎక్సైజ్ పోలీసులు తెలిపారు.

## నాయకత్వ లక్షణాలను పెంపొందించటానికి క్రీడలు దోహదం

**కొత్తూరు, జూన్ 18, ప్రభాతవార్త:** మైక్రోసాఫ్ట్ సహకారంతో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం కొత్తూరు మండలంలోని ఇన్ముల్ నర్వ గ్రామంలో క్రీడా పోటీలను వారు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ నర్సయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. యువతి, యువకుల కోసం నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొం దిస్తాయని అన్నారు. క్రీడలు స్నేహభావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీసి వారికి ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు తెలిపారు. కొత్తూరు కేపీఎల్ గ్రౌండ్‌లో యువకుల కోసం క్రికెట్, వాలీబాల్ పోటీలు, ఇన్ముల్ నర్వ గ్రామంలోని సిఎల్‌సి మైదానంలో యువతుల కోసం ఖోఖో, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలను ఐదు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విజేతలు, రన్నరప్ జట్లకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సీనియర్ మేనేజర్ భరత్, మేనేజర్ రాములు, మేకగూడ వీడీసీ కమిటీ అధ్యక్షుడు బి. రాజు ముదిరాజ్, ఉపాధ్యక్షుడు అక్కముల ఆంజనేయులు, ఇన్ముల్ నర్వ వీడీసీ అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు గణేష్, యూడబ్ల్యూహెచ్ బృంద సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.